

దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 24 | సంచిక : 98 | ది.14-6-2025 | విజయవాడ | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-




సీఎం సీపీఆర్వోగా నియమితులైన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన గుర్రం మల్సూర్ -విజయవాడ, జూన్ 13 (వార్తాప్రభ) :

# విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం

- పిల్లలకు భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలు నేర్పించాలి...
- ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండాలి...
- విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి...
- గురుకుల పాఠశాల సదుపాయాలు డే స్కాలర్స్‌కు కల్పించే అంశంపై అధ్యయనం చేయాలి
- విద్యా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి






**హైదరాబాద్,జూన్ 13 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలని... ఇందుకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని సీఎం స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నామని సీఎం వెల్లడించారు. పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో ఐసీసీసీలో విద్యా శాఖ అధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. ఈ క్రమంలో బోధన ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు నైపుణాల పెంపునకు వీలుగా విద్యా వ్యవస్థను మార్పు చేయాలని సీఎం సూచించారు. హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్‌లో వారు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న నేపథ్యంలో విద్యా శాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకొని హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇలా వివిధ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న వివిధ విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యమైన భోజనం, యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందిస్తుండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారని.. డే స్కాలర్స్‌కూ ఆ పాఠశాలల్లోనే అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. పిల్లలకు కుటుంబం, సమాజం ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు కుటుంబం, సమాజం పట్ల వారి బాధ్యతను తెలియజేసేలా కౌన్సెలింగ్ ఇప్పిస్తే వారు మానసికంగా దృఢంగా తయారవడంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా రాణిస్తారని సీఎం అన్నారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## ఈ నెల 23 నుంచి నెల రోజుల పాటు ఇంటింటికీ

# 'తొలి అడుగు' విజయయాత్ర

- పార్టీ సంస్థాగత కమిటీలు త్వరగా పూర్తి చేయండి.. పార్టీ కోసం పని చేసేవారికి చోటు కల్పించండి
- జూలైలో పార్టీ నేతలు, కార్యకర్తలకు నాయకత్వ శిక్షణ శిబిరాలు
- ఎమ్మెల్యేలు రోజు పార్టీకి కొంత సమయం కేటాయించాలి
- రేపు లక్ష చోట్ల నిర్వహించే యోగా డే సన్నాహక కార్యక్రమంలో పాల్గొనండి
- తల్లికి వందనం నిధులు విడుదలతో సర్వత్రా సంతృప్తి
- వచ్చే వారమే అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తాం
- ఒకే నెలలో రెండు సూపర్ - 6 పథకాలు అమలు చేసి చూపిస్తున్నాం
- టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతలు, గ్రామస్థాయి కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి,జూన్ 13 (వార్తాప్రభ) :** సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఈ నెల 23 నుంచి నెల రోజుల పాటు కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన కార్యక్రమాలు, అమలు చేసిన పథకాలు వివరించాలనీ ముఖ్యమంత్రి చంద్రబాబు టిడిపి క్యాడర్ ను ఆదేశించారు ఈ కార్యక్రమంలో లీడర్ నుంచి కేడర్ వరకూ ప్రతి ఒక్కరూ విజయయాత్రలో పాల్గొనాలి. ప్రచారం చేసే విషయంలో పోటీ పడాలి. మొదటి ఏడాది ఏం చేశామో చెప్పడంతో పాటు దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలనీ పిలుపునిచ్చారు. ఈ ఏడాదిలో సాధించిన విజయాలు తట్టుకోలేకనే ప్రత్యర్థులు మహిళలను అవమానించడంతో పాటు దాడులకు దిగుతున్నారన్నారు. మహానాడు విజయవంతమైందని సేద తీరొద్దు. పార్టీ సంస్థాగత కమిటీలు పూర్తి చేయాలి. పార్టీ కోసం కష్టపడేవారికి అవకాశం కల్పించాలి. అందరి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుని కమిటీల్లో స్థానం కల్పించాలన్నారు. కుటుంబ సాధికార సారధిలో ఉంటేనే ఎవరికైనా పదవులు వస్తాయి. కార్యకర్తలు ఎప్పుడూ డైనమిక్‌గా ఉండాలన్నారు. జూలై నుంచి కార్యకర్తలు, నేతలకు నాయకత్వ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దుతామని,అధికారంలో లేనప్పుడు కార్యకర్తలు చాలా కష్టపడ్డారు. ఎమ్మెల్యేలు కూడా ప్రతి రోజూ పార్టీ కార్యక్రమాలకు కొంత సమయం కేటాయించాలి. ప్రజలతో నిత్యం కలుపుగోలు తనంతో మెలగాలి. రాష్ట్రంలో పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని 5 లక్షల మందితో నిర్వహిస్తున్నామని, అదే రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నానన్నారు.. ఇప్పటికే 2.21 కోట్ల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారనీ, మూడు రోజులు పాల్గొంటే సర్టిఫికేట్ ఇస్తామనీ, యోగా జీవితంలో భాగం కావాలి. హెల్తీ, వెల్దీ, హ్యాపీ సమాజంగా మారడానికే దీనికి శ్రీకారం చుట్టానన్నారు. ఇది మనందరి కార్యక్రమం. ఏపీని ప్రపంచ పటంలో పెట్టేందుకు చేపట్టిన ఉద్యమమన్నారు. రేపు లక్ష చోట్ల యోగా డే సన్నద్ధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుంటూ, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే యోగా లాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం పథకం అమలు చేశాం. చెప్పిన మాట ప్రకారం ఎంతమంది ఉన్నా పథకం వర్తింపజేస్తామని చెప్పి ఇచ్చాం. నిన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులతో నిర్వహించాల్సిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని అహ్మదాబాద్‌లో విమానం కూలడంతో రద్దు చేశాం. కార్యకర్తలు, నాయకులు ఎన్నికల ముందు సూపర్-6, మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ గురించి ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. వాటిని కూటమి ప్రభుత్వం అమలు చేసి చూపిస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ముఖ్య పథకాలన్నీ ఏడాదిలోపే అమలు చేస్తున్నాం. విచ్చలవిడి అప్పులతో గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ.10 వేల కోట్లు తల్లికి వందనం పథకాలు విడుదల చేశాం. తల్లుల అకౌంట్లో రూ.13 వేలు, పాఠశాలల అభివృద్ధికి రూ.2 వేలు కేటాయిస్తున్నాం. పాఠశాలలు తెరిచేలోపే పథకం అమలు చేస్తామని చెప్పి చేశాం. ఒక బిడ్డ ఉన్న తల్లులు 18,55,760 మంది, ఇద్దరు బిడ్డలు ఉన్న తల్లులు 14,55,322 మంది, ముగ్గురు బిడ్డలు ఉన్న తల్లులు 2,10,684 మంది, నలుగురు బిడ్డలు ఉన్న తల్లుల 20,053 మంది ఉన్నారు. గత ప్రభుత్వం 42 లక్షల మందికే పథకాన్ని అమలు చేసింది. ఆ ప్రభుత్వం కంటే మన ప్రభుత్వం 25 లక్షల మందికి అదనంగా ఇస్తోంది. వారు చేసిన ఖర్చు రూ.5,540 కోట్లు, మన ప్రభుత్వం చేసే ఖర్చు రూ.8,747 కోట్లు. వాళ్ల కంటే ఏడాదికి రూ.3,205 కోట్లు అదనంగా ఖర్చు చేస్తున్నాం. తల్లికి వందనం పథకం నిధుల విడుదలపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని వేల కోట్లు ఒక పథకానికిక ఒకేసారి విడుదల చేయడం ఒక చరిత్ర. నలుగురు పిల్లులు ఉంటే రూ.13 వేల చొప్పున రూ.52 వేలు వారి అకౌంట్లోకి వెళ్తున్నాయి. అయినా బుద్ధి, జ్ఞానం లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. నిబంధనలు కూడా మార్చకుండా మెరుగ్గా ఇస్తున్నాం. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను కూటమి కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి. మనం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఏడాదికి రూ.34 వేల కోట్లు ఇస్తున్నాం. అన్నాక్యాంటీన్ల ద్వారా 4 కోట్ల భోజనాలు సరఫరా చేశాం. రైతుల సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ కింద ఈనెల 20వ తేదీన పథకాన్ని ప్రారంభిస్తున్నాం.' అని సీఎం అన్నారు. ఏడాది పాలన పూర్తైన సందర్భంగా టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబుకు నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద రక్త దానానికి గవర్నర్ విజ్ఞప్తి



**విజయవాడ, జూన్ 13 (వార్తాప్రభ) :** జూన్ 14న జరుపుకునే ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా అర్హులైన వారందరూ స్వచ్ఛంద రక్తదానం చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎపి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎస్. అబ్దుల్ నజీర్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు రక్తదానం యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేసుకునేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు గవర్నర్ అన్నారు. ఈ సంవత్సరం ప్రపంచ రక్తదాతల దినోత్సవం 2025 "రక్తాన్ని ఇవ్వండి, ఆశను ఇవ్వండి, కలిసి మనం ప్రాణాలను కాపాడుదాం" అనే ఇతి వృత్తంతో జరుపుకుంటున్నట్లు గవర్నర్ అబ్దుల్ నజీర్ చెప్పారు. రాష్ట్రంలోని విద్యార్థులు మరియు యువత అందరూ ఎపి రెడ్ క్రాస్ మొబైల్ యాప్ ద్వారా రక్తదాతలుగా నమోదు చేసుకోవాలని మరియు స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 20 రెడ్ క్రాస్ రక్త కేంద్రాలలో రక్తదానం చేయాలని మరియు లక్షలాది మంది ప్రజల ప్రాణాలను, ముఖ్యంగా పేదలు మరియు అణగారిన వర్గాల ప్రాణాలను కాపాడాలని కోరారు.

## సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేనికి సుప్రీంకోర్టులో ఊరట



**న్యూఢిల్లీ,జూన్ 13 (వార్తాప్రభ) :** కొమ్మినేనిని వెంటనే విడుదల చేయాలని సుప్రీం కోర్టు ఆదేశం.విడుదలకు సంబంధించిన నిబంధనలను ట్రయల్ కోర్టు పర్యవేక్షిస్తుందన్న ధర్మాసనం భవిష్యత్తులో మరోసారి అలాంటి వ్యాఖ్యలు చేయవద్దని కొమ్మినేనికి హెచ్చరిక జారీ చేసింది. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. సాక్షి ఛానల్‌లో అమరావతి మహిళలను కించపరిచేలా చర్చా కార్యక్రమం నిర్వహించి, అనుచిత ప్రశ్నలు వేశారన్న ఆరోపణలపై అరెస్టయిన ఆయనను తక్షణమే విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అయితే, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం చేయవద్దని ధర్మాసనం ఆయనను గట్టిగా

- 7లో

# తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది విదార్థులకు రూ.8,745 కోట్ల సాయం

- అర్హులు ఎంతమంది ఉన్నా సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- గత ప్రభుత్వం కంటే ఏడాదికి రూ.3,205 కోట్లు అదనంగా కూటమి ప్రభుత్వ సాయం
- ఐదేళ్లలో రూ.16వేల కోట్లు అదనంగా తల్లుల అకౌంట్లలో కూటమి ప్రభుత్వం జమ
- 9,600 పాఠశాలల్లో వన్ క్లాస్, వన్ టీచర్
- ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చాలని తల్లిదండ్రులను కోరుతున్నా
- వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత కూటమి ప్రభుత్వానిది
- రూ.2వేలు నా బ్యాంక్ అకౌంట్ లో పడినట్లు 24 గంటల్లో నిరూపించాలి, లేనిపక్షంలో తీవ్రమైన పరిణామాలు
- తల్లికి వందనం పథకంపై విలేకరుల సమావేశంలో మంత్రి నారా లోకేష్

**ఉండవల్లి,జూన్ 13 (వార్తాప్రభ) :** అర్హులు ఎంతమంది ఉన్నా తల్లికి వందనం సాయం అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. తల్లికి వందనం పథకంపై ఉండవల్లి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే తల్లికి వందనం పథకానికి శ్రీకారం చుట్టడం జరిగింది. బాబు సూపర్ సిక్స్‌లో ప్రధానమైన హామీ తల్లికి వందనం. ఈ తల్లికి వందనం ద్వారా 8,745 కోట్ల రూపాయలను 67,27,000 విద్యార్థుల తల్లుల అకౌంట్లలో జమచేయడం జరిగింది. ఇందులో భాగంగా మొదటి తరగతి, ఇంటర్ మొదటి ఏడాది పిల్లలు చేరిన తర్వాత వారి తల్లుల అకౌంట్లలో కూడా నిధులు జమచేయడం జరుగుతుంది. తల్లి లేని పిల్లలు ఉంటే వారి తండ్రి అకౌంట్ లేదా గార్డియన్ అకౌంట్ లో ఈ నిధులు జమచేయడం జరిగింది. అనాథాశ్రమాల విషయంలో రీవాలిడేట్ చేసుకుని జిల్లా కలెక్టర్ గారికి ఆదేశాలు చేసి వారి అకౌంట్లలో నేరుగా నిధులు జమచేయడం జరుగుతుంది.

**అర్హులు ఎంతమంది ఉన్నా సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది..** గౌరవ ముఖ్యమంత్రి గారు ఇప్పటికే చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది. సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడు, ఎలా చేస్తామనేది చెప్పడం జరిగింది. ప్రజలందరినీ నేను కోరేది ఒక్కటే.. అర్హులు ఎంతమంది ఉన్నా సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ నిధులు ఇంకా అకౌంట్ లో జమచేసే ప్రక్రియ జరుగుతోంది. ఈ రోజు, రేపు కూడా అకౌంట్లలో నిధులు జమ అవుతాయి. సోమవారం నుంచి వారి అకౌంట్లలో నిధులు జమకానిపక్షంలో జూన్ 26 వరకు సమయం ఇస్తున్నాం. మనమిత్ర వాట్సాప్ ద్వారా లేక జీఎస్ డబ్ల్యూఎస్ కి వెళ్లి మా దగ్గర ఉన్న డేటాలో పొరపాట్లు ఏమైనా ఉంటే తెలియజేస్తే సరిదిద్దుకుని అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.




**30 లక్షల మంది బీసీ సోదరులకు తల్లికి వందనం సాయం అందజేత..** రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ రెండో ఏడాది పిల్లలను చూస్తే సుమారు 30 లక్షల మంది బీసీ సోదరులకు తల్లికి వందనం వర్తించింది. 12 లక్షల మంది ఎస్సీ సోదరులకు, 4.26 లక్షల మంది ఎస్టీ సోదరులకు, సుమారుగా 66వేల మంది మైనార్టీ సోదరులకు, 8.5 లక్షల మంది ఈబీసీ సోదరులకు తల్లికి వందనం అందించడం జరిగింది. దాదాపు ఇప్పటికే ఒక్కరే సంతానం ఉన్న 18.55 లక్షల మంది తల్లుల అకౌంట్ లో రూ.13వేల రూపాయలు కూటమి ప్రభుత్వం ఇచ్చింది. ఇద్దరు పిల్లలు ఉన్న 14.55 లక్షల మంది తల్లులకు రూ.26వేలు కూటమి ప్రభుత్వం అందించడం జరిగింది. ఇందులో సుమారుగా 29.10 లక్షల మంది పిల్లలు కవర్ అవుతారు. ముగ్గురు పిల్లలు ఉన్న 2.10 లక్షల మంది తల్లుల అకౌంట్ లో రూ.39వేలు కూటమి ప్రభుత్వం అందజేయడం జరిగింది. ఇందులో 6.32 లక్షల మంది పిల్లలు కవర్ అయ్యారు.

**వైసీపీ హయాంలో 42 లక్షల మందికే అమ్మఒడి..** గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో ఎంతమంది పిల్లలు ఉన్నా అంతమందికి ఇస్తామన్నారు. వాళ్లు ఇవ్వకుండా కేవలం 42 లక్షల మంది పిల్లలకే ఆనాడు అమ్మఒడి ఇవ్వడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 67,27,000 మంది పిల్లలకు నిధులు జమచేయడం జరిగింది. గతంలో ఏడాదికి రూ.5,540 కోట్ల రూపాయలు వాళ్ల కార్యక్రమానికి ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వం రూ.8,745 కోట్లు తల్లుల అకౌంట్ లో నిధులు జమచేయడం జరిగింది. అంటే సుమారుగా రూ.3,205 కోట్లు అదనంగా కూటమి ప్రభుత్వం అందజేస్తోంది. అంటే ఐదు సంవత్సరాల్లో రూ.16వేల కోట్ల రూపాయలు అదనంగా తల్లుల అకౌంట్లలో కూటమి ప్రభుత్వం నిధులు జమచేయబోతోంది.


## పాస్‌పోర్టు పోయినది

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, కృష్ణలంక, మంటాడవారి వీధి, డోరు నెం.41-8-30 కాపురస్తుడు నువ్వుల సింహాచలం గారి కుమారుడు నువ్వుల మనోహర్ అను నేను ది.11-06-2025వ తేదీన ఇంటి వద్ద నుండి బెంజిసర్కిల్‌కు వెహికల్‌పై వెళ్లుచుండగా మార్గమధ్యంలో కవర్‌లో ఉంచిన విజయవాడలో ది.18-06-2021న జారీచేసిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం.వి1943653 మరియు కొన్ని కాగితములు పోయినవి. వెంటనే పరిసర ప్రాంతంలో వెదకిననూ కనిపించలేదు. సదరు పాస్‌పోర్టును ఉపయోగించి, ఎవ్వరైనా ఎటువంటి అన్యాక్రాంతములు జరిపిన యెడల చట్టప్రకారం తీసుకునే యావత్తు చర్యలకు బాధ్యులు కాగలరని తెలియ జేయుచూ, ఎవరికైనా ఒరిజినల్ పాసుపోర్టు దొరికినచో నాకు తెలియపరచినచో తగిన పారితోషకం ఇవ్వబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

సెల్ నెం. 7777926779


# నేతన్నలకు వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీలు పెంపు

-రాష్ట్ర బి.సి.,ఇ.డబ్ల్యు.ఎస్. సంక్షేమం, చేనేత మరియు టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఎస్.సవిత

**అమరావతి,జూన్ 13 (వార్తాప్రభ) :** వేలాది మంది నేతన్నలకు లబ్ధిచేకూర్చే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీలను పెంచే కీలక నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నట్లు రాష్ట్ర బి.సి., ఇ.డబ్ల్యు.ఎస్. సంక్షేమం, చేనేత మరియు టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ సాంప్రదాయ చేనేత రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కీలక నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో దాదాపుగా 1,036 చేనేత సహకార సంఘాలున్నాయని, వాటిలో 89 వేల మగ్గం నేత కార్మికులు ఉన్నారన్నారు. వీరందరికీ ఆర్థికంగా ఊతం ఇచ్చే విధంగా, వారి జీవనోపాధి మెరుగుపడే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ ఛార్జీలను గణనీయంగా పెంచడం జరిగిందన్నారు. ఆప్కో కు ఉత్పత్తులను సరఫరా చేసే ప్రాథమిక చేనేత కార్మికుల సహకార సంఘాలు కింద పనిచేసే నేత కార్మికులకు వేతనాలు మరియు ఛార్జీల పెంపు వర్తిస్తుందన్నారు. బ్లీచింగ్ ఛార్జీలు బండిల్‌కు రూ.129 నుంచి రూ.148లకు (15%), డైయింగ్ ఛార్జీలు బండిల్‌కు రూ.362 నుంచి రూ.434లకు (20%), బెడ్‌షీట్ నేత మజూరి రూ.83 నుంచి రూ.100లకు (20%) మరియు టవల్ నేత మజూరి రూ.31 నుంచి రూ.40లకు (30%) పెంచడం జరిగిందని ఆమె తెలిపారు. ఫలితంగా ఒక్కో నేతన్నకు నెలకు అదనంగా రూ.3 వేల ఆదాయం రానున్నదన్నారు. ఈ విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ ఛార్జీల పెంపుదలతో నేతన్నలకు ఆర్థిక భరోసా కలగడమే కాకుండా నేతన్నల సంక్షేమం, అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని



తెలియజేస్తుందన్నారు. దేశంలోను, రాష్ట్రంలోను గ్రామీణ ఉపాధిలో వ్యవసాయం తర్వాత చేనేత రంగంపైనే ఎక్కువ మంది ఆధారపడి ఉన్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి పెద్ద పీఠ వేయడం జరిగిందన్నారు. అధికారంలోకి రాగానే నేతన్నలకు చేదోడుగా ఉండేందుకై ఎగ్జిబిషన్లు, విక్రయదారులు, కొనుగోలు దారుల సమావేశాలు నిర్వహించడం జరిగిందని, ఆధునిక డిజైన్లపై నేతన్నలకు శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. అదే విధంగా ఎన్నికల సమయంలో చేనేతలకు 50 సంవత్సరాలకే ఫించను ఇస్తామని ఇచ్చిన హామీని నిలపెట్టుకోవడం జరిగిందని, ప్రతి నెలా రూ.4 వేల చొప్పున దాదాపు 92,274 మంది నేతన్నలకు ఫించను అందజేయడం జరుగుచున్నదన్నారు.

# ఎడిటోరియల్

## ఎర్రజెండా ఎగురవేసిన ఇరాన్.. ఇజ్రాయెల్ తో ఇక పెద్ద యుద్ధమే

ప్రస్తుతం ప్రపంచంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ యుద్ధం వల్ల వేలాది మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా, లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. ఈ దారుణం ఎప్పుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి. రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం ఇంకా మదిలో ఉండగానే, ఇటీవల అమెరికా సిరియాపై బాంబుల వర్షం కురిపించింది. ఆ తర్వాత ఇజ్రాయెల్ పాలస్తీనాపై, దాని శత్రు దేశాలపై ఒక్కసారిగా విరుచుకుపడింది. పాలస్తీనాకు సహాయం చేస్తున్న ఇతర దేశాలపై కూడా తీవ్రస్థాయిలో బాంబుల వర్షం కురిపించింది. హమాస్ ఉగ్రవాదులపై కూడా విరుచుకుపడి బీభత్సంగా దాడులు చేస్తూ మట్టుబెడుతోంది. తాజాగా ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడింది. తమ శత్రుదేశమైన పాలస్తీనాకు సహాయం చేస్తోందని, తమపై కుట్రలకు పాల్పడుతోందని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఈ కారణంతోనే ఇరాన్‌పై దాడులు చేసింది. ఇరాన్‌లోని ప్రధాన నగరాలపై ఇజ్రాయెల్ డ్రోన్‌ల సహాయంతో దాడులు చేసి, క్షిపణులను ప్రయోగించి భారీ స్థాయిలో నష్టం కలిగించింది. ఇది ఇరాన్ దేశానికి తీవ్రస్థాయిలో నష్టం కలగజేసింది. దీంతో ఇరాన్ తీవ్రంగా స్పందించడానికి సిద్ధమవుతోంది. ఇటీవల ఇజ్రాయెల్ చేసిన దాడులకు ప్రతీకారంగా గట్టి కౌంటర్ ఇవ్వాలని ఇరాన్ భావిస్తోంది. ఇందులో భాగంగానే జంకరన్ మసీదు మీద ఎరుపు రంగు జెండా ఎగురవేసింది. తీవ్ర స్థాయిలో దుఃఖం, ప్రతీకారం వంటి సంకేతాలను బలంగా చూపించడానికి ఇటువంటి జెండాలను ఎగరవేస్తారు. ఒక రకంగా ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి ఇరాన్ ఇలాంటి ఎరుపు రంగు జెండా ఎగురవేసిందని తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య భీకరమైన దాడులు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. సైన్యం పరంగా చూసుకుంటే ఇరాన్ కంటే ఇజ్రాయెల్ సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, వారు యుద్ధ రంగంలోకి దిగితే భీకరంగా దాడులు చేస్తారు. ఇటీవల సిరియా, హమాస్ ఉగ్రవాదులకు ఈ అనుభవం ఎదురైంది. పైగా హమాస్ ఉగ్రవాదులను ఇరాన్ భూభాగంలోనే ఇజ్రాయెల్ మట్టుబెట్టింది. ఈ రకంగా చూస్తే ఇజ్రాయెల్ నుంచి ఇరాన్ దేశానికి తీవ్రమైన ప్రతిఘటన తప్పదని తెలుస్తోంది. దీనికి తోడు అత్యంత పటిష్టమైన గగనతల రక్షణ వ్యవస్థను ఇజ్రాయెల్ కలిగి ఉంది. అలాంటప్పుడు ఇరాన్ ఇజ్రాయెల్ మీద ఎలాంటి దాడులు చేస్తుందనేది చూడాల్సి ఉంది. దీనిని ఇజ్రాయెల్ ఏ విధంగా అడ్డుకుంటుంది అనేది కూడా గమనించాల్సి ఉంది. మొత్తానికి మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.


## డీజీ లక్ష్మి పథకం పై అవగాహన మరియు శిక్షణా కార్యక్రమం





విజయవాడ పశ్చిమ జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా - విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. వెంకట నారాయణ, డీజీ లక్ష్మి పథకం పై కొత్తగా ఎన్నుకున్న డీజీ లక్ష్మి లకు అవగాహన మరియు శిక్షణా కార్యక్రమము ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) మాట్లాడుతూ, ఈ కార్యక్రమము నందు కొత్తగా ఎన్నుకున్న డీజీ లక్ష్మి ల కొరకు కస్టమర్ సర్వీస్ సెంటర్స్ (సి ఎస్ సి ఎస్) ఏర్పాటుకు సంబంధించి ఒక్కొక్క ఎస్ఎల్ఎఫ్ నుండి ఒక్కొక్కరిని ఎంపిక చేశారని, డిగ్రీ అర్హత ప్రమాణంగా వీరిని ఎన్నుకోవడం జరిగిందని చెప్పారు. ఈ మేరకు వారికి శిక్షణ తరగతులు నిర్వహించి డిజి లక్ష్మి పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు మరియు వారికి బయోమెట్రిక్ డివైస్ ను కూడా అందించడమే కాకుండా ఏవిధంగా ఉపయోగించాలో తెలియ జేసారు. ఎనుకున్న ఈ-శ్రమ సర్వ్ ద్వారా అసంఘటిత కార్మికులకు సర్వే చేయనున్నారు అని అన్నారు. ట్రైనింగ్ సమయం పూర్తయిన తర్వాత వారికి లాగిన్ వచ్చే విధంగా చూసి తద్వారా సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సి ఎస్ సి సెంటర్స్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సర్వీసులు అన్ని అందించబడతాయన్నారు. డిజి లక్ష్మి ద్వారా దాదాపు 200 సర్వీసులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ సర్వీసులను ప్రజలకు చేరువ చేసేందుకు విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో మూడు సర్కిల్ లో ఉన్న 450 సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ సేవలను విజయవాడ నగర పాలక సంస్థ ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమము కు గౌరవ. ప్రాజెక్ట్ ఆఫీసర్ , డాక్టర్ ఫణి కుమార్ టి.ఈ., సుజాత టి.ఈ., సి.ఎస్.సి. డిస్ట్రిక్ట్ కో ఆడిటర్. బాజీ షాహీద్., రెడ్డి లత డి.ఆర్.పి., ద్రాక్షాయని డి.ఇ.ఓ లు పాల్గొన్నారు.

## 16న కొండపల్లి కౌన్సిల్ ఎన్నిక




ఇబ్రహీంపట్నం జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి):కొండపల్లి పురపాలక సంఘమునకు పరోక్ష పద్ధతిలో 2021 నవంబర్ లో చైర్ పర్సన్ మరియు రెండు వైస్ - చైర్ పర్సన్ పదవులకు గాను నిర్వహించబడిన ఎన్నికల ఫలితాలతో కూడిన సీల్డ్ కవర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం వారి ఆదేశానుసారం గౌరవ ఉన్నత న్యాయస్థానం నుండి పొందబడియున్న దృష్ట్యా, సంబంధిత సీల్డ్ కవర్ నందు నిక్షిప్తమైన ఎన్నికల ఫలితాలను ప్రకటించుటకు గాను ప్రత్యేక సమావేశాన్ని ది. 16-06-2025 అనగా సోమవారం ఉదయం 10 గంటలకు కొండపల్లి మున్సిపల్ సమావేశపు హాలు నందు ఏర్పాటు చేయబడినదని మరియు తగు సమాచారం ఎన్నికైన వార్డు / ఎక్స్ అఫీషియో సభ్యులకు తెలియజేయడమైనదని ఎన్నికల నిర్వహణ అధికారి మరియు విజయవాడ రెవెన్యూ డివిజనల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# రక్తదానం చెయ్యండి ప్రాణాలు కాపాడండి...

.. జిజిహెచ్ సూపర్డెంట్ ఆశాలత.
నేడే ప్రపంచ రక్తదాన దినోత్సవం.



మచిలీపట్నం జూన్ 13 (వార్తాప్రభ ప్రతినిధి)ప్రపంచ రక్త దాన దినోత్సవంను పురస్కరించుకొని శుక్రవారం మచిలీపట్నం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి లో జిల్లా వ్యాప్తంగా రక్తదానం అధిక సార్లు చేసిన పలువురిని ఘనంగా సత్కరించారు. ఆసుపత్రి సిబ్బంది ప్రజలు రక్త దానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అపోహలను తొలగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపర్డెంట్ ఆశాలత మాట్లాడుతూ రక్తదానం చేయండి ప్రాణలను కాపాడండి అని యువతకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు రక్తదానం పై అవగాహన కలిగి ఉండాలని, అవసర సమయంలో రక్తం మనిషి ప్రాణాలను కాపాడుతుందని అన్నారు. కృత్రిమంగా తయారు చేయలేని ఏకైక పదార్థం మానవ రక్తమే అని అన్నారు. యువత రక్తదాన కార్యక్రమంలో విరివిగా పాల్గొనాలని కోరారు. ఇప్పటివరకు అత్యధికంగా రక్తదానం చేసిన వారిలో ముగ్గురిని శాలువాతో సన్మానించారు. తిరుమణి మురళి (77 సార్లు), విజయ్ కుమార్ (74 సార్లు), విజయలక్ష్మి దేవి (8 సార్లు) రక్తదానం చేసినందుకు జి జి హెచ్ సూపర్డెంట్ అభినందించారు. పౌష్టికాహారం లోపంతో శాస్త్ర చికిత్సలు, ప్రసూతి సమయంలో మహిళలకు రక్తం అవసరం అవుతుందని అలాంటి సమయంలో దానం చేసిన రక్తం ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. రక్తదాన కార్యక్రమం నిర్వహించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ప్రజల్లో అపోహలను తొలగించి రక్త దానం పై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డిప్యూటీ సూపర్డెంట్ శ్రీనివాస్, జిల్లా ఆరోగ్య శాఖ ఎయిడ్స్, టీబి అండ్ లెప్రసీ అధికారి అంబటి వెంకటరావు, ప్రొఫెసర్ అండ్ పెథాలజిస్ట్ డాక్టర్ కిరణ్ మై, డాక్టర్ గీతా వాణి, డాక్టర్ పావని, స్వచ్ఛంద సంస్థ శ్వేత ఆకూరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరిపై ఆ భగవంతుడి ఆశీస్సులు వుండాలి

● విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ● చిట్టినగర్ లో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు హాజరు ● నగర అభివృద్ధిలో నగరాలు ఒక భాగం







విజయవాడ పశ్చిమ జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి) నియోజకవర్గం అభివృద్ధి తో పాటు రాష్ట్రాభివృద్ధి జరిగే విధంగా శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై వుండాలి. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ శాసనసభ్యుడు మరుపిళ్ల చిట్టి కాలం నుంచి నగరాలు అభివృద్ధిలో ఒక భాగం అయ్యారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. చిట్టి నగర్ లో జరుగుతున్న నగరాల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం 14వ వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) ముఖ్యఅతిథి గా హాజరయ్యారు. వేదమంత్రాలు మంగళ వాయిద్యాలతో ఆలయ కమిటీ సభ్యులు పురోహితులు ఎంపీ కేశినేని శివనాథ్ కు స్వాగతం పలికారు. ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామిను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరాలు వారి సొంత నిధులతో గుడి, కళ్యాణ మండపం ఏర్పాటు చేసుకోవటం చాలా గొప్ప విషయమన్నారు. అలాగే వివిధ సహాయ కార్యక్రమాల ద్వారా పేద ప్రజలను ఆదుకునే విషయంలో నగరాలు ఎప్పుడు ముందంటారని కొనియాడారు. ఆలయ అభివృద్ధి, ఆలయ కమిటీకి అండగా వుంటామన్నారు. ఐదు రోజుల పాటు జరిగే శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రజలందరూ పాల్గొని ఆభగవంతుడి ఆశీస్సులు పొందాలని సూచించారు. రాష్ట్రాన్ని సుభిక్షంగా చూడాలని శ్రీ వేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిల్లా శీను, నగరాల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మరుపిళ్ల తిరుమల్లేష్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్. ఎస్. బేగ్, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సోలంకి రాజు, రాష్ట్ర వాణిజ్య విభాగ ఆర్గనైజింగ్ సెక్రెటరీ దనేకుల సుబ్బారావు, పశ్చిమ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు ఆర్ మాధవ, పశ్చిమ నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు సుఖాసి సరిత, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, మైలవరపు కృష్ణ, ఆర్. శ్రీనివాసరావు (మాస్టారు ),టిడిపి సీనియర్ నాయకులు కోగంటి రామారావు, టిడిపి సీనియర్ మహిళా నాయకురాలు బంక నాగమణి, ఆలయ కమిటీ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థ బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి



విజయవాడ పశ్చిమ జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఏపీ లో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ పాఠశాల విద్యను గాడిలో పెట్టేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి అన్నారు. విద్యాధరపురం, లేబర్ కాలనీ లోనీ జీ.ఎన్.ఆర్.ఎం హై స్కూల్ లో పాఠ్య, రాత పుస్తకాలను ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ,పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్ వీ ఎన్ గణేష్ తో కలిసి శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రత్నకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాఠశాలల ప్రారంభం నుంచే ఉచిత పాఠ్య ,రాత పుస్తకాలు, యూనిఫాం దుస్తులు అందజేస్తూ విద్యా వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అదేవిధంగా సన్న బియ్యంతో రుచికరమైన మధ్యాహ్న భోజనం సౌకర్యం కూడా విద్యార్థులకు కల్పిస్తుందని ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు లక్ష్యంతో చదవాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు మైలవరపు దుర్గారావు మాట్లాడుతూ పశ్చిమ లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎమ్మెల్యే సుజనా చౌదరి కట్టుబడి ఉన్నారని తెలిపారు . విద్యారంగానికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రాధాన్యతతో పాటు ఎమ్మెల్యే సుజనా చౌదరి అందిస్తున్న సహకారం వెలకట్టలేనిదన్నారు .సుజనా ఫౌండేషన్ ద్వారా జి.ఎన్.ఆర్.ఎం పాఠశాలలో రూ 15 లక్షలతో ఐ.ఓ.టి లాబ్ ను మరియు గ్రంథాలయాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా పశ్చిమ లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని మైలవరపు దుర్గారావు తెలిపారు. ఇన్చార్జ్ హెడ్మాస్టర్ ఎస్ వీ ఎన్ గణేష్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. పిల్లలందరూ పాఠశాలకు వచ్చి బాగా చదువుకోవాలని కోరారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే లక్ష్మీనారాయణ, సుజనా మిత్రా కోఆర్డినేటర్ పుప్పాల భవాని అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు...

# కొండపైన అనధికార కట్టడాలను నిర్మూలించండి

ప్రజల క్షేమమే ప్రధాన లక్ష్యం- విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ పశ్చిమ జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి) ప్రజల క్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని, కొండపైన ఉన్న అనధికార కట్టడాలను నిర్మూలించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా వన్ టౌన్, పంజా సెంటర్, చిట్టినగర్, కేఎల్ రావు పార్క్, సివిఆర్ ఫ్లై ఓవర్, పైపుల్ రోడ్, అజిత్ సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొండపైన అనధికార కట్టడాలను నిర్మూలించాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజల ప్రాణాలకు ఎటువంటి భంగం కలగకుండా ఉండేందుకు విజయవాడ నగర పాలక సంస్థ తీసుకుంటున్న చర్యలు తూచా తప్పకుండా అందరూ పాటించాలని అధికారులను ఆదేశించారు. వన్ టౌన్ లో బ్రిడ్జి వద్ద కూలిన గోడను చూసి త్వరగా మరమ్మతులు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని, గోడ నిర్మాణం పూర్తయ్యేలోపు వెంటనే మెష్ వేసి ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కె ఎల్ రావు రోడ్, కేఎల్ రావు పార్క్ ప్రాంతాలన్నీ పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని, పారిశుద్ధ్య కార్మికులు ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని అన్నారు. సివిఆర్ ఫ్లైఓవర్ కింద ఉన్న అవుట్ ఫాల్ డ్రైన్ పరిశీలించి, గత కొంతకాలంగా చేస్తున్న డీసిల్టింగ్ ప్రక్రియ కృషి కనపడుతోందని అవుట్ఫాల్ డ్రైన్ కొంతవరకు పరిశుభ్రంగా ఉందని, మరోవైపు జెసిబి తో వ్యర్థాలను తీస్తున్న పనులు కనబడుతున్నాయని, అధికారులందరూ నిత్యం ఇలాగే ప్రతి అవుట్ ఫర్ డ్రైన్ లలో ఈ కృషి పెడితే కచ్చితంగా డీసిల్టింగ్ ప్రక్రియ విజయవంతమై రోడ్డుపైన నీటి నిల్వలు లేకుండా చూసుకోగలమని అన్నారు. నిజాంపేట్, గాంధీ హిల్ ఔట్ ఫాల్ డ్రైన్ ల స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## ఏడో రోజుకు ఎన్ సీసీ శిబిరం



ఇబ్రహీంపట్నం, జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి): కేతనకొండ నేతాజీ సైనిక్ స్కూల్ (సీబీఆర్ క్యాంపస్)లో జరుగుతున్న పదవ ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్ సీసీ (గుంటూరు) ఆధ్వర్యంలో సీఏటీసీ - 7 శిబిరం శుక్రవారం ఏడో రోజుకు చేరింది. శిబిరాన్ని కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్.సుదర్శన్ ప్రారంభించారు. 64 మంది బాలికల క్యాడెట్లు, పీఐ స్టాఫ్ కొండపల్లి ఖిల్లా, మ్యూజియంను సందర్శించారు. 327 మంది ఎన్ సీసీ క్యాడెట్లకు కంచికచర్ల ఫైర్, డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ స్టేషన్ ఆఫీసర్ ఎ.శివారెడ్డి, సిబ్బంది అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వారికి క్యాంపు కార్యాలయం సిబ్బంది సర్టిఫికెట్, మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో సుబేదార్ మెజర్ షేక్ ఇమామ్ సాహెబ్, ట్రైనింగ్ జేసీవో ఆర్.ఎస్.రాజు, పీఐ స్టాఫ్, ఏఎన్ వోలు, కార్యాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్స్ లో జర్నలిస్ట్ పిల్లలకు 50% ఫీజు రాయితీ కల్పించండి

మంత్రి కొల్లు రవీంద్రను కోరిన మచిలీపట్నం మీడియా మిత్రులు
ఫీజు రాయితీకై కలెక్టర్ అండార్స్ చేసిన మంత్రి



మచిలీపట్నం జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి)జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్ పిల్లలకు 50% ఫీజు రాయితీ కల్పించాలని మచిలీపట్నం మీడియా మిత్రులు రాష్ట్ర గనులు, భూగర్భవనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. ఈ మేరకు శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో తక్షణమే ఫీజు రాయితీ ఉత్తర్వులు విడుదలయ్యేలా చూడాలని కోరారు. అలాగే 6వ తరగతి పైబడిన జర్నలిస్టుల పిల్లలకు విద్యాశాఖ ద్వారా ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మచిలీపట్నం మీడియా మిత్రుల విజ్ఞప్తిపై మంత్రి కొల్లు రవీంద్ర సానుకూలంగా స్పందించారు. ఫీజు రాయితీ, పాఠ్య పుస్తకాల పంపిణీ చేసే కలెక్టర్ కు అండార్స్ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇందుకు మీడియా మిత్రులు మంత్రి రవీంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

## బదిలీలలో ఉద్యోగులకు సానుకూలంగా వ్యవహరించాలి

ఏపీ జెఎసి రాష్ట్ర నాయకులు.




మచిలీపట్నం జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి)ఏపీ జెఎసి అమరావతి సభ్య సంఘ నాయకులతో ఉమ్మడి కృష్ణాజిల్లా సమావేశం శుక్రవారం స్థానిక ఈడేపల్లి రెవెన్యూ కల్యాణ మండపం లో నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఉద్యోగ సంఘ ఏపీ జెఎసి రాష్ట్ర నాయకుడు బొప్పరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కాంట్రాక్ట్ ప్రాతిపదిక పైన పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వార్డు గ్రామ సచివాలయ ఉద్యోగస్తుల హక్కుల పై ఏపీ జేఏసీ పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం హేతుబద్ధీకరణ చేపట్టడాన్ని ఏపీ జెఎసి స్వాగతిస్తున్నామని అన్నారు. అలానే బదిలీ ప్రక్రియలో కొన్ని వెసులుబాట్లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ వార్డు సచివాలయం కు చెందిన 1,50,000 మంది ఉద్యోగుల బదిలీలు చేపట్టిన ప్రభుత్వం కొంత మేరకు వెసులుబాటు కల్పించాలని అంతర్ జిల్లాల బదిలీలో ఉద్యోగస్తులకు సానుకూలంగా ప్రభుత్వం దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కృష్ణాజిల్లా అధ్యక్షులు శ్యామ్ గౌడ్, ఉమ్మడి కృష్ణాజిల్లా జేఏసీ నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రంగనాయక స్వామి దేవస్థానంలో అన్న సమారాధన



మచిలీపట్నం జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి)మచిలీపట్నం రాబర్ట్ సన్ పేటలో వేంచేసి ఉన్న శ్రీ రంగనాయక స్వామి వారి దేవస్థానం నందు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించారు . రంగనాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం గొప్ప అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జయప్రదంగా నిర్వహించినందుకు శ్రీ రంగనాయక స్వామి వారి దేవస్థానం ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాగాపాటి సత్యబాబు భక్తులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై జగన్మాతకు నృత్య కళార్చన

విజయవాడ పశ్చిమ జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)సనాతన ధర్మ ప్రచారం, లలిత కళలకు ప్రోత్సాహం అందించేందుకు గానూ సకల కళలకు ఆరాధ్యదేవతయైన ఆది పరాశక్తి, జగన్మాత శ్రీ కనకదుర్గమ్మవారి సన్నిధిలో నూతన రాజగోపురం ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం 6.30 నుండి కూచిపూడి నృత్యప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. చెన్నై కు చెందిన శ్రీ భరతకళ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు భక్తి శ్రద్దలతో శ్రీ కనకదుర్గ అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. నృత్యాలయ స్థాపకులు గురు రోజా రాణి ఆధ్వర్యంలో నృత్య విద్యార్థులు తమ ప్రదర్శనలో భాగంగా పలు భక్తి కీర్తనలకు 25మంది కళాకారులు లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు. ప్రదర్శన అనంతరం కళా బృందానికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించి, ప్రసాదములు అందజేశారు.



# పేర్ని నానీ.. నీ పాపం పండింది.. ఇక వదిలేది లేదు

- సీఆర్‌జెడ్ భూముల్లో పట్టాలివ్వడాన్ని కోర్టులే తప్పుబట్టాయి
- 2006లో బందరు పోర్టుని అమ్మేసేందుకు ప్రయత్నించిన నీచుడు పేర్ని నాని
- తప్పు చేసినోడిని చట్టం వదిలిపెట్టదని హెచ్చరించిన మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి)**అరాచకాలు, అకృత్యాలకు పాల్పడి.. కేసుల భయంతో వణుకుతున్న పేర్ని నానికి మతి భ్రమించినట్లుందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎద్దేవా చేశారు. మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పేర్ని నాని విచిత్ర వైఖరిపై ధ్వజమెత్తారు. అరెస్టు భయంతో పిచ్చిపిచ్చి ప్రేలాపణలకు పోతున్నాడు. అరాచకాలకు పాల్పడి, ప్రజల్ని మభ్యబెట్టి బతికిన ఎంతో మంది కాల గర్భంలో కలిసిపోయారు. ఐదేళ్ల ప్రజల్ని పీక్కుతిని.. బుద్ధిమంతుడిలా సభలు పెట్టడం సిగ్గుచేటు. తప్పు చేసి దాన్ని కప్పిపెట్టుకోవడానికి బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్నికల్లో వారసుడిని గెలిపించుకోవాలనే తాపత్రయంతో చేయరాని తప్పులు చేశారు. పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలకు దొంగ పట్టాలు సృష్టించి తహశీల్దార్ కార్యాలయంలో అర్ధరాత్రి రాయిస్తుంటే మేం పట్టుకున్నాం. జేసీకి అడ్డంగా దొరికిపోయారు. మేమంతా వెళ్లడం తో వైసీపీ నాయకులు ఆ పట్టాల కట్టలు పట్టుకుని పారిపోయారు. తప్పు చేయకుంటే పారిపోవాల్సిన అవసరం ఏంటి? ఫ్రీట్ ఫీల్డ్‌లో పట్టాలిస్తే తప్పేంటని ప్రశ్నించడానికి సిగ్గుండాలి. అన్ అబ్జక్షనబుల్ ఎన్ క్రోచ్ మెంట్స్ అంటున్నప్పటికీ.. అవన్నీ అబ్జక్షనబుల్ ఎంక్రోజ్ మెంట్స్ అని అధికారులు చెబుతున్నారు. ఖాళీ స్థలాల్లో ఇళ్లు కట్టుకున్నవారికి పట్టాలివ్వడానికి ఎవరూ వ్యతిరేకం కాదు. కానీ, ఉద్దేశ్యపూర్వకంగా లబ్ధి పొందడం కోసం దొంగపట్టాలిస్తే వాటిపై విచారణ చేయిస్తుంటే వణికిపోతున్నాడు. తండ్రీకొడుకులిద్దరూ పారిపోయారు. తహశీల్దార్ సునీల్ జూన్ 2023నే బాపులపాడు మండలానికి బదిలీపై వెళ్తే.. 2024 మార్చిలో పట్టాలు సృష్టించారు. ఏడాది క్రితమే వెళ్లిపోయిన వ్యక్తి ఎన్నికల కోడ్ వచ్చే నాటికి ఇక్కడే ఉన్నాడని బుకాయించేందుకు ప్రయత్నించడానికి సిగ్గుండాలి. ఇలాంటి అక్రమాలకు పాల్పడినందునే ప్రజలు దారుణంగా ఓడించారు. ఎన్నికల సమయంలో తహశీల్దార్ సునీల్ అనపర్తిలో ఎన్నికల డ్యూటీలో ఉన్నవారిని బందరులో ఉన్నారని చెప్పడం పేర్నినాని అబద్దాలకు పరాకాష్ట. పేదల బియ్యాన్ని పందికొక్కులా బొక్కి తినడం వాస్తవం కాదా? నీ గోదాములో 8000 బియ్యం బస్తాలు మాయమవ్వడం వాస్తవం కాదా? గోదాము ఎవరి పేరుతో ఉంటే వారిని విచారిస్తారని తెలియదా? నిజంగా భార్యపై అంత ప్రేమ ఉంటే పేదల బియ్యాన్ని దొంగతనంగా అమ్ముకునేవాడివి కాదు. గోదాము నుండి కాకినాడ వరకు వెళ్లిన ప్రతి లారీ వివరాలు రికార్డెడ్ గా ఉన్నాగానీ బుకాయించేందుకు ప్రయత్నిస్తున్నారు. పేపర్లో వార్త రాగానే కోర్టుకు వెళ్లావు. పేపర్లో వార్త రాగానే కోర్టుకు రావడమేంటని అక్కడ గడ్డి పెడితే వెనక్కి వచ్చావు. అయినా సిగ్గురాలేదా? ప్రెస్ మీట్ పెట్టి అడ్డగోలుగా వాగితే హీరో అయిపోతానని భావిస్తున్నావేమో.. రాష్ట్ర ప్రజలందరూ నిన్ను బఫూన్‌లా చూస్తున్నారని తెలుసుకో అని హెచ్చరించారు. ఇలాంటిడోని గెలిపించుకున్నామా అని బందరు ప్రజలు ఈసడించుకుంటున్నారు. రూ.1.70 కోట్లు చెల్లించానని చెబుతున్నావంటే తప్పు చేసినట్లే కదా? ఇలాంటి వ్యక్తులు రాజకీయాలకు అర్హులా? పేదల సొమ్ము దొబ్బితిన్న వారికి ప్రజాక్షేత్రంలో ఉండే అర్హత ఉందా? ఇప్పటి వరకు చూసీ చూడనట్లు వదిలేశాం. ఇకపై నిన్ను వదిలే ప్రశక్తే లేదని పేర్ని నాని గుర్తుంచుకోవాలి. ఎక్కడో జరిగిన కేసుల గురించి మాట్లాడే పేర్ని నాని.. తాను తప్పు చేయలేదని చెప్పే ధైర్యం ఉందా? పేదల ఇళ్లపై నిజంగా అంత చిత్తశుద్ధి ఉంటే.. 6400 టిడ్కో ఇళ్లు పేదలకు ఎందుకు పంచలేదు.? శాంక్షన్ లెటర్ ఇచ్చిన వారికి కూడా ఇళ్లు పంచకపోవడం పేర్ని నాని దుర్మార్గానికి నిదర్శనం. కపట నాటకాలు చెప్పడం తప్ప ప్రజల గురించి ఏ కోశాన కూడా ప్రేమ లేదు. ఇళ్ల స్థలాల పేరుతో అధిక ధరలకు భూములు కొనుగోలు చేయించి కమిషన్లు దండుకున్నారు. కరఅగ్రహారం వద్ద భూసేకరణ పేరుతో డబ్బులు దండుకున్నారు. శ్మశానం భూములు, పోరంబోకు భూములు సహా అన్ని భూముల్లో కూడా ఎకరాకు సగటున రూ.10 లక్షల చొప్పున కమిషన్లు వసూల్ చేసుకున్నారు. మెడికల్ కాలేజీ కోసం భూ కొనుగోలులో రూ.8 కోట్ల అక్రమాలు జరిగాయని కాగ్ నివేదికలో పేర్కొంది. అక్రమాలన్నీ బయటపడతుండడంతో అరెస్టు చేయండి అంటూ సానుభూతి డ్రామాకు తెరలేపారు. గిలకలదిండి భూములపై కోర్టులో కేసులు వేశారంటున్న పేర్ని నానిని ప్రశ్నిస్తున్నా.. పేదలకు భూములు కొనుగోలు చేసి అందించండి. అంతేగానీ సీఆర్జెడ్ పరిధిలో భూములిస్తే వారికి పట్టాలు రావని తెలిసీ ఇవ్వడం మోసం చేయడం కాదా? అవి సీఆర్జెడ్ భూములని కోర్టు పేర్కొనడం, కలెక్టర్ అవి సీఆర్జె భూములని నిర్ధారించడం నిజం కాదా?గత ఐదేళ్లు తట్ట మట్టి కూడా బందరు పోర్టులో తీయకుండా నాశనం చేస్తే.. కూటమ అధికారంలోకి రాగానే మళ్లీ పనులు మొదలు పెట్టాం. ఎంపీ బాలశౌరి ఆధ్వర్యంలో కేంద్రం నుండి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకొచ్చి పనులు ప్రారంభించి పూర్తి చేస్తున్నాం. గత ఏడాది కాలంగా పనుల్ని పరుగులు పెట్టించాం. 2026 జూన్ నాటికి పనులు పూర్తి చేస్తామని మాటిచ్చాం. పూర్తి చేసి చూపిస్తాం. బందరులో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కడుపుబ్బ.. విమర్శలకు తెరలేపారు. అధికారుల్ని బెదిరించేలా పేర్ని నాని మాట్లాడడం హేయం. జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులపై నిందలేయడం ద్వారా ఏం చెప్పాలనుకుంటున్నారు? పేర్ని నాని అరాచకాలను చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. అసత్య ఆరోపణలు చేస్తామంటే చూస్తూ ఊరుకోం. బి య్యం అక్రమాలను విచారించమని కోర్టు ఆదేశిస్తే.. విచారణకు పిలిచిన పోలీసు అధికారులను తప్పుబడతారా? చట్ట ప్రకారం నడచుకుంటున్నాం కాబట్టే ఇంత అరాచకాలకు పాల్పడి కూడా మీరు రోడ్లపై ప్రశాంతంగా తిరుగుతున్నారు. మీలా మేము చట్టాన్ని అతిక్రమిస్తే మీ పరిస్థితి ఊహించుకోవడం కూడా కష్టమేనని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో కూడా కక్కుర్తి పడిన పేర్ని నానికి మాట్లాడే అర్హత లేదు. గత ఐదేళ్లు బందరు అభివృద్ధిని పట్టించుకోవడం మానేస్తే.. కూటమి అధికారంలోకి రాగానే గ్రామాల్లో సిమెంటు రోడ్లు నిర్మించాం. మున్సిపాలిటీకి నిధులు తీసుకొచ్చాం. బందరుని దశాబ్దాలుగా వేధిస్తున్న చెత్త సమస్యకు శాశ్వ పరిష్కారం చూపించాం. మురుగు నీటి నుండి బందరును కాపాడుతున్నాం. ఇన్ని రకాలైన అభివృద్ధి పనులు చేస్తుంటే.. చూసి ఓర్వలేకపోవడానికి సిగ్గుపడాలి. మున్సిపాలిటీకి రూ.40 కోట్లు ఇచ్చేందుకు ఆంధ్రాబ్యాంకు సిద్ధంగా ఉన్నప్పటికీ.. తీర్మానం చేయనీయకుండా అడ్డుకుంటున్నది, బడ్జెట్ ఆమోదానికి కూడా అడ్డంకులు సృష్టిస్తున్నది వైసీపీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. మీ పాపాలన్నీ శాపాలు కాబోతున్నాయి హెచ్చరించారు. రాబోయే కాలంలో మున్సిపాలిటీని వైసీపీ నుండి విముక్తి చేస్తామని సవాల్ చేశారు. ముడా భూముల్లో ఎక్కడ ఎవరు ఎంత తవ్వారో సాంకేతిక ఆధారాలు తెప్పిస్తా. చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. బందరులో డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగిస్తుంటే.. ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. మురుగు కాల్వల్లో కనీస చెత్త కూడా తొలగించని నీవు అక్కడేదో జరిగిపోయిందనడానికి సిగ్గుపడాలి. బందరుని ఏ విధంగా అభివృద్ధి చేయాలా అని మేము తాపత్రయపడుతుంటే.. బురద వేయాలనుకోవడం పేర్ని నాని బుద్ధికి వదిలేస్తున్నాం. డిగ్రీలు చదువుకున్న యువతకు ఉద్యోగాల్లేక కూలి పనులు చేసుకునేలా మీరు తయారు చేస్తే.. వారికి లక్షల వేతనాల ఉద్యోగాలొచ్చేలా మేము ప్రణాళికలు రచిస్తున్నాం. చేసిన పాపాలు వెంటాడుతుండడంతోనే పేర్ని నాని నిద్రల్లేని రాత్రులు గడుపుతున్నాడు. దొంగపట్టాలు, బియ్యం దొంగతనం వంటి పాపాలు పేర్ని నానిని వదలవు. బినామీల పేర్లతో, అత్తమామల పేరుతో, అనుయాయుల పేరుతో భూములు బదలాయించుకున్నావు. ఎక్కడ ఎంత దోచుకున్నావో ప్రతి లెక్కా బయటకు రాబోతోంది. బందరు ప్రతిష్టను ప్రపంచ పటంపై చూపించడమే నా ముందున్న తక్షణ కర్తవ్యం. బందరు పోర్టు పూర్తి చేయడం, ఇన్లాండ్ వాటర్ వేస్ ద్వారా అమరావతికి అనుసంధానించడం, మెడికల్ కాలేజీ సహా అన్ని అభివృద్ధి కార్యక్రమాలు మా కష్టమే. అధికారంలో ఉన్నంత కాలం దోచుకోవడం తప్ప పేర్ని నాని నియోజకవర్గానికి గానీ, జిల్లాకు గానీ చేసిందేమీ లేదు. ఇంత వయసొచ్చినా ఇంకా నిందారోపణలు చేసి తప్పించుకుంటామంటే కాలం వదిలి పెట్టదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన 38 మంది వ్యక్తులకు జరిమానా విధించిన న్యాయస్థానం వారు

**విజయవాడ పశ్చిమ జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఐ.పి.ఎస్. వారి అదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరిగింది.ఈ నేపథ్యంలో ది.13-06-2025 వ తేదిన 5వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 38 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను ఆరవ ఆడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ లో ప్రవేశపెట్టగా, గౌరవ న్యాయమూర్తి శ్రీ లెనిన్ బాబు గారు మొత్తం 38 మందిలొ 19 మందికి ఒక్కొక్కరికి రూ.15,000/- చొప్పున రూ.2,85,000/-, మిగిలిన 19 మందికి ఒక్కొక్కరికిరూ.10,000/- చొప్పున రూ.1,90,000/- మొత్తం 38 మందికి రూ.4,75,000/- జరిమానా విధించడం జరిగింది.ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కాబట్టి వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తెలియజేశారు.

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం విజయవాడ సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాడిశ రూపేష్ నియామకం

*బిసి సంఘం విజయవాడ సిటీ యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ గా పిళ్ళా శ్రీకాంత్ నియామకం*



**విజయవాడ పశ్చిమ జూన్ 13: (వార్తా ప్రభ ప్రతినిధి)**జాతీయ బీసీ సంక్షేమ సంఘం విజయవాడ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాడిశ రూపేష్ ను నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య నియామకపు ఉత్తర్వులు అందజేశారు. అదే విధంగా విజయవాడ సిటీ యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ గా పిళ్ళా శ్రీకాంత్ ను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా రూపేష్ , శ్రీకాంత్ మాట్లాడుతూ తమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ఆదేశానుసారం సంఘం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. బీసీల సమస్యల పరిష్కారం లక్ష్యంగా తాము పని చేస్తామని అన్నారు. తమ నియామకం పట్ల సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు వై. నాగేశ్వరరావు, రాష్ట్ర ఇంచార్జి నూకానమ్మ, విజయవాడ సిటీ అధ్యక్షులు కనిశెట్టి లక్ష్మణరావు , విజయవాడ సిటీ యువజన అధ్యక్షులు పీసా అరుణ్ కుమార్ లకు తమ అభినందనలు తెలియజేశారు. అలాగే సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్యను శాలువాతో బీసీ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు.

## మెట్రో విజయవాడకు మరో మణిహారం..

- భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సమగ్ర రవాణా ప్రణాళిక
- భాగస్వామ్య పక్షాల సూచనలతో దార్శనిక ప్రణాళికకు తుది రూపు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి)**మెట్రో రైలు ప్రాజెక్టు విజయవాడకు మరో మణిహారం కానుందని.. భాగస్వామ్య పక్షాల సలహాలు, సూచనలకు కూడా ప్రాధాన్యమిస్తూ విజయవాడ సమగ్ర రవాణా ప్రణాళిక (సీఎంపీ)కు తుది రూపు ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.మెట్రో రైలు ప్రాజెక్టు సహా విజయవాడ సమగ్ర రవాణా ప్రణాళికపై శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ సమీక్షా సమావేశం నిర్వహించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎన్‌టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం, ఏపీఎంఆర్‌సీఎల్ డిప్యూటీ సీజీఎం పి.రంగారావు కూడా హాజరైన ఈ సమావేశంలో తొలుత సిస్ట్రా ఎంవీఏ కన్సల్టింగ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి అంకుశ్ మల్హోత్రా సీఎంపీ ముసాయిదాను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వచ్చే 25-30 సంవత్సరాల నగర అవసరాలను సైతం పరిగణనలోకి తీసుకొని రూపొందించే దార్శనిక ప్రణాళికను సీఎంపీగా పేర్కొంటామని, విజయవాడ ప్రణాళికకు సంబంధించి ట్రాఫిక్, కుటుంబ సర్వేను పూర్తిచేశామన్నారు. భౌగోళిక స్థితిగతులు, ట్రాఫిక్, రవాణా పరిస్థితులు, రవాణా మౌలిక వసతులు, భవిష్యత్తు జనాభా, ట్రావెల్ డిమాండ్ తదితరాల ఆధారంగా సీఎంపీ ముసాయిదాకు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. విజయవాడతో పాటు పరిసర ప్రాంతాలకు సంబంధించి రహదారుల నెట్‌వర్క్, ప్రజా రవాణా, మార్గాలు, రిజిస్టర్డ్ వాహనాలు తదితర అంశాలతో పాటు రహదారి ప్రమాదాలను సైతం విశ్లేషించినట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నవ రాజధాని అమరావతికి గేట్‌వేగా ఉన్న విజయవాడ సమగ్రాభివృద్ధిలో భాగంగా జనాభా అవసరాలకు అనుగుణంగా రవాణా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సి ఉందని, ఈ నేపథ్యంలో కాంప్రెహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ రూపకల్పన తుదిదశకు చేరుకుందని.. జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, పోలీస్, ఆర్‌టీసీ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, నగరపాలక సంస్థ తదితర భాగస్వామ్య పక్షాల సలహాలు, సూచనలు తీసుకునేందుకు వీలుగా ఈ సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఇదే విధంగా మెట్రో రైలు ప్రాజెక్టు విజయవాడ నగరానికి గొప్ప ఆస్తి అని.. ఫేజ్-1 కారిడార్ 1ఏ (గన్నవరం-పీఎన్‌బీఎస్), కారిడార్ 1బీ (పీఎన్‌బీఎస్-పెనమలూరు) భూ సేకరణ ప్రక్రియకు నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కృష్ణా జిల్లా పరిధిలోని మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన అంశాల్లో అన్ని సహాయసహకారాలు అందించడం జరుగుతుందని ఆ జిల్లా కలెక్టర్ బాలాజీ తెలిపారు. సమావేశంలో ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎంఎల్‌కే రెడ్డి, డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ విస్తృత తనిఖీలు



**ఇబ్రహీంపట్నం, జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం, ఆపరేషన్ విభాగం అధికారులు శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి, తుమ్మలపాలెం, జూపూడి, కాచవరం, కేతనకొండ, కొటికలపూడి గ్రామాల్లో ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డీపీఈ (విజిలెన్స్) పి.విజయకుమారి, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.వసంతరావు తెలిపారు. ఈ తనిఖీల్లో 46 మంది అధికారులు, 189 మంది సిబ్బంది 46 బృందాలుగా ఏర్పడి 4682 సర్వీసులను తనిఖీ చేశారు. అనుమతులకు మించి అధిక లోడు వినియోగిస్తున్న 486 మందికి రూ.8.06 లక్షల అపరాధ రుసుము విధించారు. విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయని చెప్పారు. వినియోగదారులు వారి పరిధిలో ఉన్న విద్యుత్ మీటర్లకు తప్పనిసరిగా సీలు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ఒకవేళ సీలు లేకపోయినా, తుప్పు పట్టి ఓడిపోయినా వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఏ ప్రాంతంలోనైనా విద్యుత్ అధికారుల తనిఖీల్లో సీలు లేకపోవడం, ఉద్దేశపూర్వకంగా వాటిని తొలగించి గాట్లు పెట్టడం గమనిస్తే విద్యుత్ చౌర్యంగా నిర్ధారించి కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ దాడుల్లో డీఈఈ జి.గురు కిషోర్, ఐ.సుధాకర్, కె.స్టాలిన్ కుమార్, జె.శ్రీనివాసరావు, ఏఈ కె.వెంకన్న, డివిజన్ లోని ఆపరేషన్ ఏఈలు, విజిలెన్స్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదాత చల్లగుండాలి



అన్నదాత ఉంటేనే
అన్నమింత దొరికేది
ఆకలి కేకలు దూరం
అయి ఇక హాయిగుండేది
రైతన్నకు అండగా
వారి బ్రతుకున కొండగా
మనమంతా! ఉండాలి
వారు చల్లగుండాలి
వానలు బాగా కురియాలి

పంటలు చాలా పండాలి
అప్పులన్ని తీరిపోయి
హాలికుడే మురియాలి
రైతు లేని దేశమేది
అభివృద్ధికి నోచుకోదు
ముద్ద నోటికందాలి
నోటుతో కడుపు నిండదు

-గద్వాల సోమన్న,
9866414580

## 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహం ఏర్పాటు కి రంగం సిద్ధం

- ఈ నెల 16 న ఉదయం 9 .55 నిముషాలకి శంకుస్థాపన
- సితార సెంటర్ సమీపంలో లేబర్ కాలనీ గ్రౌండ్లో కొలతలు వేయించిన ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్



**విజయవాడ పశ్చిమ జూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**డూండి గణేష సేవా సమితి ఆధ్వర్యంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో72 అడుగుల మహా మట్టి గణపతివిగ్రహ శంఖుస్థాపనకి రంగం సిద్ధమైంది. దానిలో భాగంగా శుక్రవారం ఉదయం సితార సెంటర్ సమీపంలో ఉన్న లేబర్ కాలనీ గ్రౌండ్లో గణపతి విగ్రహం ఎక్కడ ఏర్పాటు చేయాలి... ఆ విగ్రహం పక్కన మరో ఇద్దరు దేవుళ్ళ ప్రతిరూపాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై వాస్తు ప్రకారం ,ఆగమ శాస్త్రం ప్రకారం కొలతలు వేశారు. డూండి రాకేష్ ఈ కొలతలు కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. గతేడాది కూడా వినాయక చవితి సంధర్భంగా ఇదే ప్రాంతంలో భారీగా మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విషయం తెల్సిందే. ఐతే బుడమేరు వరదలు వల్ల పూజలకు ఇబ్బందులు ఎదురవ్వడం జరిగింది. అంతటి ప్రకృతి విళయంలో కూడా మట్టి గణపతిని సందర్శించడం భక్తులు ఇబ్బందులు లేకుండా అప్పటికప్పుడు బాహుబలి సినిమా సెట్టింగులు తలదన్నే విధంగా సర్వీబాదులు, చెక్కలతో వంతెన నిర్మాణ చేపట్టి భక్తులకు చౌకర్యాలు మెరుగు పర్చిన తీరు ఆనాడు సంచలనమే....ఆనాడు డూండి రాకేష్ కి ప్రభుత్వం తరపున ఎలాంటి పదవులు లేవు. నేడు రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పదవిలో వున్న ఆయన రెచ్చిపోయి తనకు ఆనాడు అడుగడుగునా అవరోధాలు సృష్టించిన వైసీపీ ప్రత్యర్థులకు మాటల్లో కాకుండా చేతల్లో తానేంటో నిరూపించే వేదికగా ఏర్పాటు చేయనున్న 72 అడుగులు మట్టి గణపతిని ఏర్పాటు చేయాలని ఆయన రంగంలో దిగారని ఆయన వర్గీయులు చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని నిర్మాణం అద్భుతంగాజరగాలనే ఆకాంక్షిస్తూ వినాయకచవితి సందర్భముగా72 అడుగుల మహా మట్టి గణపతి భారీ విగ్రహంనిర్మాణానికి ఈ నెల 16 సోమవారం ఉదయం 09.55 నిముషాలకుశంఖుస్థాపన కార్యక్రమము చేయుటకు పండితులు నిర్ణయించారు. లేబర్ కాలనీ గ్రౌండ్, సితార సెంటర్,విద్యాధరపురం డిపో ప్రక్కన, వన్ టౌన్, విజయవాడ.కావున తమరు మా ముఖ్య అతిధిగా విచ్చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికిప్రతిష్ఠాత్మకంగా నిలిచే ఈ ఉత్సవానికి తగు ప్రోత్సాహకములు అందించి,స్వామి వారి కృపకు పాత్రులు కావాలని డూండి గణేష సేవా సమితికార్యవర్గం తరుపున రాకేష్ పిలుపునిచ్చారు.

## పట్టాలి ఇచ్చిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

*మండల పరిషత్ సమావేశంలో కోరిన తుమ్మలపాలెం,గుంటుపల్లి ప్రజా ప్రతినిధులు*
*సమావేశానికి ఆలస్యంగా హాజరైన అధికారులు*
*అసహనం వ్యక్తం చేసిన ఎంపీపీ*




**ఇబ్రహీంపట్నం జూన్ 13(వార్తా ప్రభ ప్రతినిధి):**ఇబ్రహీంపట్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు.ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో గుంటుపల్లి మరియు తుమ్మలపాలెం గ్రామాల లబ్ధిదారులకు గతంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసి స్థలాలు కేటాయించలేదు. ఆ విషయంపై ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. వెంటనే లబ్ధిదారులకు స్థలం కేటాయించాలని కోరారు. గతంలో ఎన్నోసార్లు అధికారులకు ఈ విషయంపై వినతి సమర్పించిన స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తుమ్మలపాలెం ఎంపిటిసి సభ్యులు పోలిశెట్టి తేజ మాట్లాడుతూ డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ రెండో విడత సిఎస్ఆర్ నిధులు ఇప్పటిదాకా విడుదల చేయలేదని, నామ మాత్రంగా మెడికల్ క్యాంపులు నిర్వహించడం తప్ప చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న వంతెనను వెంటనే నిర్మించాలని, ప్రతినిత్యం దానిపై ప్రయాణించే ప్రజల భద్రత ప్రశ్నార్ధకంగా మారిందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖ అభివృద్ధి నివేదికలు సమర్పించారు వాటి పై చర్చ నిర్వహించారు.

**ఆలస్యంగా వచ్చిన అధికారులు అసహనం వ్యక్తం చేసిన ఎంపీపీ**

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహణలో చిత్తశుద్ధి లోపించింది. కేవలం 5 ఎంపీటీసీలు, 6 సర్పంచులు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. అధికారులు ఆలస్యంగా రావడంతో 3.30 సమావేశం ప్రారంభమైంది. దీంతో అధికారులపై ఎంపీపీ అసహన వ్యక్తం చేశారు. సమావేశానికి ప్రాధాన్యత ఇవ్వాలని మరోసారి ఇలా చేయొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో,వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ కార్యాలయంలో ఎల్.ఓ.సీ అందజేత



**విజయవాడ పశ్చిమజూన్ 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన ఎల్.ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను శుక్రవారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో34 వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రుద్రపాటి వెంకటేష్ కూటమి నేతలతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.50 వ డివిజన్ గొల్లపాలెం గట్టు కు చెందిన టీ నందిని ( 25) ఆడ బిడ్డకు జన్మనివ్వడంతో బిడ్డ అనారోగ్యానికి గురైంది పాపకు మరింత మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలుపగా ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారికి రూ 3 లక్షల 30వేల ఎల్.ఓ.సీ ను ఎన్డీఏ కూటమినేతలు బాధితురాలి కుటుంబ సభ్యులకు అందించారు అదేవిధంగా49 వ డివిజన్ కు చెందిన బి సాయిరాం ప్రసాద్ (44) హృద్రోగం తో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 5 లక్షల ఎల్. ఓ.సీ ను అందజేశారు త్వరితగతిన ఎల్.ఓ.సి మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధితుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్లు ఉదయ్, నారాయణ మూర్తి సుజనా మిత్రా కోఆర్డినేటర్ మొక్కా భవాని తదితరులు పాల్గొన్నారు

# అక్రిడేషన్ పాలసీకి ఇంత జాప్యమా?

● వెంటనే ప్రకటించి అర్హులందరికీ వెంటనే కార్డులివ్వాలి ● డబ్ల్యూజేఐ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ డిమాండ్ ● జర్నలిస్టుల సమస్యలపై ముఖ్యమంత్రిని కలుస్తాం ● పాత చట్టాలను సవరించాలి

**హైదరాబాద్:జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి)** తెలంగాణలో జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇచ్చే విధివిధానాలను వెంటనే ప్రకటించి , అర్హులైన అందరికీ వీలైనంత త్వరగా కార్డులు ఇవ్వాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ డిమాండ్ చేశారు. అక్రిడేషన్ పాలసీని సరళీకృతం చేయాలని సూచించారు. ఏడాది నుంచి ఈ అంశాన్ని తేల్చకపోవడం సమంజసం కాదన్నారు. తెలంగాణ పర్యటనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.పటిష్ఠమైన ఇన్సూరెన్స్ , ఆసుపత్రులలో ఉచిత చికిత్స, ఆరోగ్య కార్డులు తదితర అంశాలతో పాటు తెలంగాణ పాత్రికేయుల సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి త్వరలో వినతిపత్రం ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైళ్లు, విమానాల టికెట్లలో జర్నలిస్టులకు రాయితీ ఇవ్వాలని, టోల్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని తాము పోరాడుతున్నట్లు తెలిపారు. సెప్టెంబరులో దిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించి, ఈ అంశాలపై ప్రధాని మోదీకి విన్నవిస్తామని చెప్పారు. జర్నలిజం ప్రింట్ మీడియా నుంచి మొదలై వివిధ రూపాలకు విస్తరించినందున పాత చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ప్రక్రియలో పాత్రికేయులకూ భాగస్వామ్యం కల్పించాలని కోరారు.ఎమ్మెల్యేలు, మంత్రులు, గెజిటెడ్ అధికారులకు కల్పించే సౌకర్యాలను జర్నలిస్టులకు వర్తింపజేయాలన్నారు. జర్నలిస్టులు నిష్పక్షపాతంగా ఉంటేనే సమాజంలో వారిపట్ల గౌరవం పెరుగుతుందన్నారు. వారు దేశహితం కోసమే పని చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయుల పాత్ర కీలకమని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పనిచేస్తున్నా సామాజిక అంశాల్లో జర్నలిస్టులు వెనకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో ఐక్యత లేకపోవడమే అందుకు కారణమన్నారు. ఆర్థిక భద్రత, ఉద్యోగ భద్రత తదితర అంశాల్లో వెనకబడి జర్నలిస్టులు వెనకబడి ఉన్నారని, దేశమంతా ఇదే స్థితి ఉందన్నారు. వారి పక్షాన పోరాడేందుకే వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ఆవిష్కరించిందన్నారు. ప్రస్తుతందేశంలోని 16 రాష్ట్రాల్లో పాత్రికేయుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని, దేశంలోని అన్ని రాష్ట్రాలలో తమ సభ్యులు ఉన్నారని సంజయ్ ఉపాధ్యాయ తెలిపారు. జాతీయ స్థాయిలో బీఎంఎస్ కు అనుబంధంగా పని చేస్తున్నామని, త్వరలో నేపాల్ కు కూడా విస్తరించబోతున్నట్లు వెల్లడించారు.

**నేడు విద్యా సదస్సు, పాత్రికేయులకు పురస్కారాలు** జాతీయ విద్యావిధానం-2020, మీడియా పాత్ర అనే అంశంపై డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీలో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్లు డబ్ల్యూజేఐ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఉత్తమ



జర్నలిస్టులకు పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. డబ్ల్యూజేఐ రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు అనిల్ దేశాయ్, సిద్ధిరెడ్డి శ్రీనివాసరెడ్డి , కార్యదర్శి క్రాంతి, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు బాలకృష్ణ పాల్గొన్నారు.

## కాచవరం ఆటో డ్రైవర్ అనుమానాస్పద మృతి కేసులో వీడిన మిస్టరీ

● తన తండ్రిని గాయపర్చాడని.. కారుతో ఢీకొట్టి చంపిన నిందితులు
● కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు



**ఇబ్రహీంపట్నం, జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి):** తన తండ్రిపై దాడికి పాల్పడి గాయపరిచిన ఆటోడ్రైవర్ ను పథకం ప్రకారం హత్య చేసి ప్రతీకారం తీర్చుకున్న ముగ్గురు నిందితులను ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎ.చంద్రశేఖర్ కేసు వివరాలను వెల్లడించారు. కాచవరం (సత్యనారాయణ పురం) ఇందిరమ్మ కాలనీలో నడకుదుటి ఏసుబాబు, సైకం ప్రభాకర్ కుటుంబాలు నివసిస్తున్నారు. వీరు ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కొద్దికాలం క్రితం ప్రభాకర్ ఆటో మరమ్మతులకు గురవడంతో రాత్రి వేళ పనిచేస్తున్నాడు. ఈ సమయంలో శబ్దాలు రావడంతో ప్రభాకర్ ఇంటికి వెళ్లిన ఏసుబాబు అతనితో గొడవ పడ్డాడు. ఈ క్రమంలోనే కర్రతో ప్రభాకర్ పై దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ప్రభాకర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని పరిస్థితి సీరియస్ గా ఉంది. ఈ ఘటనపై కోపోద్రిక్తులైన ప్రభాకర్ కుమారులు కుమార స్వామి, నవీన్ బాబు అంతు చూస్తామని ఏసుబాబును బెదిరించారు. వారు చెప్పినట్లే ఏసుబాబును హతమార్చేందుకు ప్లాన్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తండ్రి ప్రభాకర్ వద్ద ఉన్న పెద్ద కుమారుడు నవీన్ బాబు పథకం రచించి తన తమ్ముడు కుమార స్వామి, ఇతని మావయ్య తిరుమలశెట్టి శంకర్ ను అమలు చేయాల్సిందిగా కోరాడు. ఏసు బాబు కదలికలను గమనించిన నిందితులు ఈ నెల ఐదో తేదీ అర్ధరాత్రి కాచవరం (సత్యనారాయణపురం) జాతీయ రహదారి వద్ద టీఎస్ 05 0872 నెంబర్ గల కారు నిలిపి రెండు గంటల పాటు కాపు కాశారు. ఈ సమయంలో ఏసుబాబు మద్యం మత్తులో జాతీయ రహదారి దాటి ఇందిరమ్మ కాలనీ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్నాడు. నిందితులు కారులో వేగంగా ఇందిరమ్మ కాలనీ రోడ్డులోకి వెళ్లి వెనక్కి తిరిగి జాతీయ రహదారి వైపు వస్తూ నడిచి వెళ్తున్న ఏసుబాబును పథకం ప్రకారం ఢీకొట్టి చంపారు. అనంతరం అక్కడి నుంచి మిర్యాలగూడకు పరారయ్యారు. ఈ ఘటనపై ఈ నెల 6న సైకం ప్రభాకర్ కుమారులు నవీన్ బాబు, కుమార స్వామిలపై అనుమానం వ్యక్తం చేస్తూ ఏసు బాబు తల్లి అంజలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ పుటేజీలను పరిశీలించారు. ఏసు బాబును నిందితులు కారుతో ఢీకొట్టి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు సైకం కుమార స్వామి (36), తిరుమలశెట్టి శంకర్ (44), పథకం రూపొందించిన సైకం నవీన్ బాబు (40) కాచవరం వీఆర్వో ఎదుట లొంగిపోగా అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు హౌస్ ఆఫీసర్ చంద్రశేఖర్ తెలిపారు. నిందితుల్లో తిరుమలశెట్టి శంకర్ విజయవాడ నగరంలో ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్సై విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## చోరీల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి
- శాంతి భద్రత రక్షణకు అందరూ సహకరించాలి
- ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ చంద్రశేఖర్ హెచ్చరిక



**ఇబ్రహీంపట్నం, జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి):** పోలీస్ స్టేషన్ పరిధిలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా సంచరిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హౌస్ ఆఫీసర్ చంద్రశేఖర్ సూచించారు. ప్రజలు గ్రామాంతరం వెళ్లేటప్పుడు ఇంట్లో బంగారం, నగలు ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటికి, గేటుకు పెద్ద తాళం కప్పలు కనపడే విధంగా వేయొద్దని సూచించారు. దీనివల్ల దొంగలు పగలు రెక్కీ నిర్వహించి, రాత్రి వేళలో చోరీలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు గ్రామాంతరం వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం అందిస్తే ఆ ఇంటికి లాకర్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. దీనివల్ల దొంగలు చోరీకి వస్తే అలారం మోగుతుందని, తద్వారా దొంగలను పట్టుకునే వీలుంటుందన్నారు. ఇటీవల బైక్ చోరీలు ఎక్కువగా జరుగుతున్న దృష్ట్యా చోదకులు వీల్ లాక్స్, జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

**రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి** తమ వంతు కృషి చేస్తున్నామని.. ప్రజలు, వాహన చోదకులు నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎ.చంద్రశేఖర్ కోరారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇబ్రహీంపట్నం మండలంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. సర్వీస్ రోడ్లు లేకపోవడం, వ్యతిరేక ప్రయాణం, హెల్మెట్లు ధరించకపోవడం, డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, అతివేగం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే క్రషర్ల నుంచి ఓవర్ లోడ్ తో వెళుతున్న లారీల నుంచి కంకర రోడ్లపై పడటం, యాష్ లారీల రాకపోకలు, రోడ్డు పక్కన నిలిపి ఉంచడం, ఫ్లై యాష్ రోడ్డుపై పడటం, ఇసుక లారీలు, ట్రాక్టర్లకు పట్టాలు కప్పకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయని చెప్పారు. మండల పరిధిలో ప్రతి గ్రామం వద్ద స్టాపర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల సురక్ష కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. మండల పరిధిలో 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, మరో 200 సీసీ కెమెరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వాహన చోదకులు ఇష్టారాజ్యంగా, అడ్డదిడ్డంగా ప్రయాణిస్తే సీసీ కెమెరాలు పట్టేస్తాయని చెప్పారు. సురక్షలో ఇప్పటికే చాలా కేసులు ఛేదించామన్నారు. దొంగతనాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, అదృశ్యం, రోడ్డు ప్రమాదాలు తదితర కేసులను ఛేదిస్తున్నట్లు వివరించారు.సమావేశంలో ఎస్సై విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## మాతాశిశు మరణాలు తగ్గించేందుకు 'కిల్కారి'



**ఇబ్రహీంపట్నం, జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి):** మాతాశిశు మరణాలు తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాంను ప్రవేశపెట్టిందని అరమ్మాన్ హెచ్ఆర్ డైరెక్టర్ జార్జ్ అన్నారు. కొండపల్లి శ్రామిక నగర్ (కొత్త గేటు) వద్ద పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్ సీ)ని హెచ్ఆర్ డైరెక్టర్ జార్జ్, హెచ్ఆర్ అసిస్టెంట్ నేహా, రాష్ట్ర కిల్కారి మేనేజర్ ఎల్.రాజు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిల్కారి కాల్ ద్వారా తల్లీ బిడ్డల ఆరోగ్య సమాచారం అందుతుందన్నారు. గర్భిణి 4వ నెల మొదలుకొని పుట్టిన బిడ్డ సంవత్సరం వరకు గర్భిణులు, బాలింతల మొబైల్స్ కు ఈ కిల్కారి కాల్స్ వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 01244451660ను గర్భిణులు, బాలింతలు వారి మొబైల్ లో సేవ్ చేసుకుంటే కాల్ వచ్చినప్పుడు పూర్తి సమాచారాన్ని వినగలుగుతారని చెప్పారు. మళ్లీ తిరిగి ఆ సమాచారాన్ని వినాలంటే 14423 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి వినవచ్చన్నారు. కిల్కారి కాల్ ద్వారా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీటీలు, ఏఎన్ సీస్ పరీక్షలు, బలమైన ఆహారం, ఇన్ స్టిట్యూషనల్ డెలివరీ, రక్తహీనత, డెలివరీ తర్వాత బిడ్డ గురించి, టీకాలు.. ఉపయోగాలు, ఫ్యామిలీ ప్లానింగ్, వ్యక్తిగత శుభ్రత, హ్యాండ్ వాష్ వంటి సమాచారం వింటే మాతా శిశు మరణాలు తగ్గుతాయని చెప్పారు. తల్లీ బిడ్డలు మంచి ఆరోగ్యం కలిగి ఉంటారన్నారు. ఈ కిల్కారి సేవలను గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి గర్భిణులు, బాలింతలను కలిసి కిల్కారి కాల్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. వాటి ప్రాముఖ్యతను వారికి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయకుమార్, హెచ్ వీ రత్నకుమారి, హెచ్ఏ సాంబశివరావు, కిల్కారి పీవో రాజు, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎన్నారై విభాగం ఐర్లాండ్ కమిటీ అధ్యక్షునిగా కిరణ్ అనుగుర్తి

**జగిత్యాల, జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి):** బీఆర్ఎస్ ఎన్నారై విభాగంలో భాగంగా ఐర్లాండ్ అధికారిక కమిటీని బీఆర్ఎస్ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాలా ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఐర్లాండ్ కమిటీ అధ్యక్షునిగా మొట్టమొదటిసారిగా జగిత్యాలకు చెందిన కిరణ్ అనుగుర్తి ఎన్నికయ్యారు. తాజాగా, ఐర్లాండ్ 53వ దేశంగా బీఆర్ఎస్ ఎన్నారై విభాగంలో చేరింది. దీనికి సంబంధించి 2025%-%2027 సంవత్సరాల అధికారిక కమిటీని మహేష్ బిగాల ప్రకటించారు.తెలంగాణను అభివృద్ధి మార్గంలో నడిపించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో కూడిన పరిపాలన ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారికి ప్రేరణగా నిలుస్తోందని అన్నారు.

# చట్టబద్ధ ముసుగులో హత్యలా?

● దేశ ప్రదాని నరేంద్రమోదీ బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీసిన తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ గద్దర్ వెన్నెల, ● ఆపరేషన్ కగార్ ను ఎత్తివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో వెంకటాచారి కళా బృందం ఆధ్వర్యంలో జరిగిన అఖిల పక్ష సమాశం. ● 17 న జరిగే మహాధర్నా కార్యాక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు.



**జవహర్ నగర్, జూన్ 13:(వార్తా ప్రభ)**చట్టబద్ధ ముసుగులో ఆపరేషన్ కగార్ పేరుతో హత్యలా? అని బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ గద్దర్ వెన్నెల నిలదీశారు. ఇలాంటి అమానవీయ హత్యలను వెంటనే ఆపాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వెంకటాచారి క్రాంతి కళా బృందం ఆధ్వర్యంలో జూన్-13, 2025, గురువారం రోజు మేడ్చల్, కాప్రా, జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో గల పానుగంటి బాబు హాల్ లో "ఆదివాసుల హననం ఆపండి-శాంతి చర్చలు జరపండి" అనే రౌండ్ టేబుల్ సమావేశం వెంకటాచారి అధ్యక్షతన అఖిల పక్ష కార్యక్రమం జరిగింది. మధ్య భారతదేశంలో వరుసగా జరుగుతున్న మారణహోమాన్ని అఖిల పక్షం ముక్తకంఠంతో ఖండించారు. భారత రాజ్యాంగ చట్ట విరుద్ధమైన హత్యలపై ఉన్నతస్థాయిలో న్యాయవిచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. భారత సాయుధ భద్రత బలగాల ఆధీనంలో సీనియర్ మావోయిస్టులు కొందరు ఉన్నట్లు వస్తున్న వార్తలను బట్టి, వారికి ప్రాణహాని ఉన్న నేపథ్యంలో వెంటనే కోర్టులో హాజరుపర్చాలని కోరారు. ఆదివాసి అటవీ హక్కులను ఒక క్రమ పద్ధతిలో కాలరాస్తున్నారని ఆరోపించారు. అడవుల్లో ఉన్న ఖనిజాలు, నిధి, నిక్షేపాలు ఆదాని, అంబానీ లాంటి బడా కార్పొరేట్ల దోపిడికి అనుకూలంగా ఆదివాసులను అంతమొందించే కుట్రలో బాగమే మావోయిస్టులపై జరుగుతున్న హత్యాకాండ అని స్పష్టం చేశారు. తద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎదురౌతున్న పర్యావసనాలు, జీవ, వైవిద్యానికి జరుగుతున్న నష్టాలు, ఆదివాసుల జీవించే హక్కను కాలరాస్తున్న ఆపరేషన్ కగార్ ను వెంటనే ఎత్తివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. మరణించిన వారి పార్థివ దేహాలను బంధువులకు, కుటుంబ సభ్యులకు అప్పగించకుండా, శవాలకున్న హక్కులను కూడ ఉల్లంఘించి, ఖననం చేయడం ఇంతకన్న దుర్మార్గం మరొకటి ఉండదని అన్నారు. ఇవి కేవలం మావోయిస్టు, ఆదివాసి ప్రజల మరణాలే కాదని, అవి భారత ప్రభుత్వం చేసిన రాజకీయ హత్యలేనని స్పష్టం చేశారు. అడవి నుండి ఆదివాసులను వెళ్లగొట్టే ఇదో పెద్ద మానసిక యుద్ధ ఎత్తుగడలో బాగమేనని అన్నారు. మావోయిస్టు రాజకీయాలతో సంభందం లేకపోయినా అటు ఆదివాసులు, ఇటు మావోయిస్టులు ఈదేశ పౌరులేనని గ్రహించి, శాంతియుత రాజకీయ పరిష్కారానికి అనేకమంది బుద్దిజీవులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు చేస్తున్న ఆపరేషన్ కగార్ ను ఎత్తివేసి, మానవ హనన నివారణకు శాంతి చర్చలు జరపాలనే న్యాయమైన, ప్రజాస్వామికమైన డిమాండ్ ను నరేంద్రమోదీ, అమిత్ షా ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. చట్టబద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణకు పెద్ద ఎత్తున ప్రజాఉద్యమ నిర్మాణానికి పూనుకోవాల్సిన అవసరం ఉందని అఖిల పక్షం వ్యాఖ్యానించింది. ఈపై కార్యక్రమంలో గద్దర్ వెన్నెలతోపాటు గద్దర్ అభిమాన సంఘం సి.ఎల్. యాదగిరి, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కారింగుల శంకర్ గౌడ, కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లెపూల శ్రీకాంత్, సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనురాధ, పిడిఎం చంద్రమౌళి, గద్దర్ అభిమాని సి.యల్. యాదగిరి, ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి, సిపిఎం నగేష్, తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్ మోహన్ బైరాగి, కవి, రచయిత ఎస్.కె.మీరా, సిపిఐ దర్శనం యాదగిరి, ఇఫ్టూ శివబాబు, సిహెచ్ దశరథ రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యులు, నరసింహ సిపిఐ కార్యవర్గ సభ్యులు, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునీత తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాచారి కళా బృందం గ్యార యాకన్న, మల్లంపల్లి రాజు, గోరటి నాగరాజు, డప్పు ప్రకాష్, అనుషా కళాకారులు మరియు సామాజిక కార్యకర్త, తెలంగాణ ఉద్యమ కారిణి పోత సునీత ఆలపించిన ఉద్యమ పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదేవిధంగా ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో హైదరాబాద్, ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద 17 వ తేదిన జరిగే మహాధర్నా ను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం






**జవహర్ నగర్, జూన్ 13:(వార్త ప్రభ)**ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవిజ్ఞాన వేదిక సమతా హైదరాబాద్, మేడ్చల్ జిల్లా కమిటీ, సీఆర్వై సంయుక్తంగా జవహర్నగర్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సీపీసీర్ సభ్యురాలు గోగుల సరిత మాట్లాడుతూ.. పిల్లలను పనిలో పెట్టడం వారి హక్కుల హరణ అని, చదువు, ఆట, ఆరోగ్యమే బాల్యానికి అవసరమన్నారు. ఎస్హెచ్ఓ సైదయ్య బాల కార్మికత నేరమని, పోలీసులు చర్యలు తీసుకుంటారని చెప్పారు.సమతా ఉప కన్వీనర్ డా. రజినీ బాల్యాన్ని ఎవరూ హరించకూడదని సూచించారు. సీఆర్వై ప్రతినిధి హిమ బిందు మాట్లాడుతూ.. తమ అధ్యయనంలో తెలంగాణలో 66 మంది చిన్నారులు ఇంకా పనిలో ఉన్నట్టు గుర్తించామన్నారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు మాట్లాడుతూ.. చట్టాల అమలులో లోపం, పేదరికం, అవగాహన లేకపోవడమే బాల కార్మికతకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పోస్టర్ ప్రదర్శనలు, చిన్నారుల ప్రదర్శనలు, తల్లిదండ్రులకు అవగాహన సమావేశాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్ఐ కృష్ణ, రాష్ట్ర నాయకులు రాజా, ఆనంద్ కుమార్, ఎం.శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనికెళ్ళి రైతు హఠాన్మరణ.ం



**చెరుకుపల్లి జూన్ 13 ( వార్తాప్రభ ప్రతినిధి ):-** విధి ఎవరి జీవితాన్ని ఏవిధంగా దీవించగలదో ఎవ్వరు ఊహించలేమన్నట్లుగా.... భుక్తి కోసం గ్రామములోని తోటి రైతు కూలీలతో కలిసి ఎంతో హుషారుగా పంటకాలవ మట్టి తీత పనిచేస్తుండగానే ఉన్నట్టుండి విధి కాటేసి పచ్చగా బ్రతుకుతున్న రైతుకుటుంబాన్ని శోకసంద్రంలో ముంచేసిన వైనం. వివరాల్లోకి వెళ్ళితే బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి గ్రామ నివాసి ఉల్లంగుంట ఆదినారాయణ వృత్తి రీత్యా వ్యవసాయ కుటుంబీకులు. ఎండాకాలమందు పల్లెటూళ్ళలోని రైతులు ఏ పనులు లేక భక్తి కోసం పడరాని పాట్లు పడకూడదన్న సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అన్నదాతలను అందుకోవటానికి ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టి పేద కుటుంబాలు ఏ చింతలేకుండా ఆహ్లాదకర వాతావరణంలో బ్రతికేట్లుగా ప్రవేశపెట్టిన పథకం సంగతి యావన్మందికి విదితమే కదా. ఇందులో భాగంగానే ఉల్లంగుంట ఆదినారాయణ రోజులాగానే కాల్వ తొవ్వేపనికెళ్ళి పనిలో నిమగ్నమై ఉండగా అకస్మాత్తుగా గుండె పోటు రావడంతో కుప్పకూలిపోయి శివైక్యం చెందారు. ఈ విషాద సంఘటనను తమ కన్నులారా విక్షించిన తోటి రైతులు దిగ్భ్రాంతికి గురైయి కాళ్ళు చేతులు ఆడని పరిస్థితి నెలకొందింది.

## కారులో శవం కలకలం....!

**కందులపాడు అడ్డరోడ్డు వద్ద కారులో వమై కనిపించిన వ్యక్తి**
**ఘటనా స్థలానికి చేరుకుని విచారిస్తున్న పోలీసులు**



**జి.కొండూరు:జూన్ 13 (వార్తా ప్రభ ప్రతినిధి)**కారులో ఒక వ్యక్తి శవమై కనిపించిన ఘటన ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు మండలం, కందులపాడు అడ్డరోడ్డు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం జి. కొండూరు మండలం, వెలగలేరు గ్రామంలో నివాసం ఉంటున్న అన్నెబోయిన నాగరాజు (38) పొక్లైన్(జె సి బి) ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు. ఇతనిది స్వగ్రామం ముద్దుల పర్వ.11 సంవత్సరాల క్రితం నాగరాజు కి వెలగలేరు గ్రామంలో ఉంటున్న తన అక్క కూతురు శివ పార్వతి తో వివాహం జరిగింది.వీరికి ఒక కుమార్తె (రేష్మ ), కుమారుడు (గిరి కుమార్ )ఉన్నారు.అయితే ఐదేళ్ల క్రితం వడ్డీ వ్యాపారస్తుడు వద్ద కొంత డబ్బును వడ్డీకి తీసు కోవడం జరిగిందని మృతుడు నాగరాజు భార్య శివ పార్వతి తెలియజేసింది. వారికి మద్దుల పర్వ లో ఒక ఇంటి స్థలం తో పాటు ఇల్లు ఉందని చెప్పింది.అయితే తీసుకున్న అప్పు చెల్లించడం లేదని దానికి బదులుగా మద్దుల పర్వలో ఉన్న ఇంటి స్థలాన్ని తన పేరున ఈనెల 13వ తారీకు లోపు రిజిస్ట్రేషన్ చేయాలని వడ్డీ వ్యాపారి తన భర్త ను ఒత్తిడి చేయడం జరిగిందని తెలిపింది.ఈ నెల అనగా జూన్ 12 వ తేదీ గురువారం సాయంత్రం తన భర్త నాగరాజు ఎవరిదో ఒక కారు తీసుకొని తాను మద్దుల పర్వ వెళుతున్నానని చెప్పాడని, శుక్రవారం ఉదయం ఫోన్ చేసి ఇల్లు రూ.8 లక్షల కు బేరం కుదిరిందని చెప్పడం జరిగిందని శివ పార్వతి వెల్లడించారు.ఇదిలా ఉంటే శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో కందులపాడు అడ్డరోడ్డు వద్ద ఓ హెూటల్ పక్కన బ్లూ షిఫ్ట్ కార్ లో నాగరాజు వచ్చాడని, కారు దిగి తూలుతూ కిందపడడంతో అక్కడ ఉన్న ఒక వ్యక్తి నాగరాజు ను లేపి కార్లో కూర్చోబెట్టడం జరిగిందని స్థానికులు తెలిపారు.సాయంత్రం చూడగా కారు లో నాగరాజు చనిపోయి ఉండటాన్ని చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా మైలవరం ఏసిపి వై ప్రసాదరావు, మైలవరం సిఐ దాడి చంద్రశేఖర్, జి.కొండూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ సతీష్ కుమార్ తో కలిసి ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.నాగరాజు కుటుంబ సభ్యులను విచారించి,అక్కడున్న సీసీ ఫుటేజ్ ని పరిశీలిస్తున్నారు.నాగరాజు ఎలా చనిపోయింది, కారణాలు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# వృద్ధుల ఆలోచన విధానం యువత విజయానికి స్ఫూర్తిదాయకం

● ది మండల న్యాయ సేవాధికార కమిటీ మరియు పదకొండవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ జి సుబ్రహ్మణ్యం..






**గుడివాడ,జూన్ 13 (వార్తాప్రభ) :** ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ అవగాహన దినోత్సవం (జూన్ 15) సందర్భంగా స్థానిక మండల న్యాయ సేవాధికార కమిటి ది చైర్మన్ మరియు పదకొండవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ జి. సుబ్రహ్మణ్యం శుక్రవారం సాయంత్రం బైపాస్ రోడ్ లోని మమత వృద్ధుల ఆశ్రమంను సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వేధింపులకు గురి అవుతున్న వృద్ధుల గురించి, వారి రక్షణ గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలనీ, వారి యొక్క ఆలోచన విధానం యువత విజయానికి స్ఫూర్తిదాయకం అని వారిని నిర్లక్ష్యం చేయరాదని, వారి పట్ల దయదాక్షిణ్యాలు కలిగి ఉండాలని వృద్ధాప్యంలో వారిని ఆదుకోవాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తల్లుల ఖాతాల్లోకి నిధులు.. ఆనందంలో కుటుంబాలు..

-కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు



**గుడివాడ,జూన్ 13 (వార్తాప్రభ) :** ఏపీ ప్రభుత్వం విడుదల చేసిన 'తల్లికి వందనం' నిధులు విద్యార్థుల తల్లులు, సంరక్షకుల ఖాతాలో జమ అవుతున్నాయని కళింగ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు పేర్కొన్నారు. "చెప్పిన విధంగా..ఇచ్చిన మాట ప్రకారం ఖాతాల్లో 'తల్లికి వందనం' డబ్బులు పడుతున్నాయి" అని నాగరాజు మీడియాకు తెలిపారు. ఇద్దరు పిల్లలు ఉన్న ఓ లబ్ధిదారు ఖాతాలో రూ.26 వేలు పడ్డాయని పేర్కొంటూ మరో రూ.4 వేలు స్కూల్ ఖాతాలో పడ్డాయని తెలిపారు. 'తల్లికి వందనం' పథకాన్ని గురువారం నుంచి అమలు చేస్తున్న విషయం తెలిసిందే. తల్లికి వందనం పథకానికి 67 లక్షల మంది విద్యార్థులు అర్హత సాధించారు. గత ప్రభుత్వం కంటే 24 లక్షల 65 వేల మంది కి కూటమి ప్రభుత్వం సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఒక్కో విద్యార్థికి రూ.15వేల చొప్పున విడుదల చేసింది. ఇందులో రూ.13వేలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు, మిగతా రూ.2వేలను ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కలెక్టర్ల ఖాతాలకు జమచేస్తున్నారు. అట్లాగే అర్హత కలిగి ఉండి అనఅర్హత లిస్టులోకి ఎవరైనా సాంకేతిక కారణం చేతకాని సమాచార లోపం వల్ల గాని ఉంటే ప్రతి ఒక్కరు కూడా సచివాలయం అధికారులు సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని మజ్జాడ నాగరాజు విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# టెన్త్ లో విశేష ప్రతిభ కనపరచిన నక్క హేమ నాగ త్రివేణి కి ప్రోత్సాహక నగదు బహుమతి



**ఆగిరిపల్లి, జూన్ 13 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరం గాను పదవ తరగతి ఫలితాలలో 582 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన నక్క హేమ నాగ త్రివేణి కి ప్రోత్సాహక బహుమతిగా 28,000 రూపాయలను మరియు నూతన వస్త్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని పుష్పలత మరియు పాఠశాల సిబ్బంది కానుకగా అందించి అభినందించారు.



శుక్రవారము ఉదయం 11 గంటలకు చిన్నం గంగాధర్ రావు ఇంటి వద్ద తారకరామా వాకర్స్ క్లబ్ గుడివాడ అధ్యక్షులు మెరుగుమాల బ్రహ్మయ్య ఆధ్వర్యంలో చల్లటి మజ్జిగ పంపిణీ కార్యక్రమం (పసుపులేటి ఎనోష్) నాని వితరణతో నిర్వహిస్తున్న దృశ్యం. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బచ్చు రాధాకృష్ణ, చిన్నం గంగాధర రావు, పిన్నమనేని వేణుగోపాలరావు, తమ్మినేని రామమోహనరావు, దొరడ్ల శ్యాంబాబు, కేదారి రాఘవయ్య, ఉరిమి సురేంద్ర, జి రవీంద్ర కుమార్, చలువాది మల్లికార్జునరావు, బోయిన పోతురాజు, మట్టుపల్లి బలరాం, వీరమాచనేని శైలజ, ఆంకాళమ్మ తదితర సభ్యులు పాల్గొన్నారు.
-గుడివాడ,జూన్ 13 (వార్తాప్రభ) :

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే రాము

● చంద్రయ్య డ్రైన్ పరివాహక పంట పొలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే..





**గుడివాడ,జూన్ 13 (వార్తాప్రభ) :** రైతుల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. కంకిపాడు రోడ్డులో గల చంద్రయ్య డ్రైన్ పరివాహక పంట పొలాల్లో ఎమ్మెల్యే రాము శుక్రవారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా పేద ఎరుకపాడు, బేతవోలు, పరివాహక రైతులతో ఎమ్మెల్యే రాము మాట్లాడారు. పలు అంశాలపై రైతులతో మాట్లాడిన ఎమ్మెల్యే రాము, వారికి ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా చంద్రయ్య డ్రైన్ కట్ట పటిష్టంగా లేకపోవడంతో వరదలు వచ్చిన ప్రతిసారి గండ్లు పడి పంటలు మునుగుతున్నాయని రైతులు ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. చంద్రయ్య డ్రైన్ పరివాహక రైతుల సమస్యలపై తనకు అవగాహన ఉందని.. కట్టపటిష్టానికి ఇప్పటికే 10 లక్షలతో అంచనాలు రూపొందించామని త్వరలో ఆ పనులు మొదలవుతాయని రైతులతో ఎమ్మెల్యే రాము అన్నారు. ఇప్పటికే ఆదిశగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రణాళిక బద్ధ చర్యలు తీసుకొని సమస్యల పరిష్కారానికి విజయవంతంగా చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వైస్ చైర్మన్ సుబ్బారావు, కూటమి నాయకులు దారపు రెడ్డి మనీశ్వరరావు, దారపురెడ్డి శేషు, గూడపాటి రాజు, కడవకల్లు ఆంజనేయులు, మండపాక గంగయ్య, అనంతదాసు సుబ్రహ్మణ్యం, రాజనాల సురేష్, వాసుపల్లి ఉమ శంకర్, కటికల కళ్యాణ్, చిన్నబాబు, ఆదం, మోహన్, కమల బాబ, బేతవోలు, ఎరుకపాడు, సిపూడి గ్రామాల రైతులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం






**గుడివాడ,జూన్ 13 (వార్తాప్రభ) :** పరిపూర్ణమైన ఆరోగ్యవంతులు వైద్యుల సలహామేరకు ఎన్నిమార్లయిన రక్తదానం చేయవచ్చని ఏరియా ఆసుప్రతి పాథాలజీ హెడ్ డా॥ విజయశ్రీ తెలిపారు. శుక్రవారం స్థానిక పివి నరసింహారావు కళ్యాణ మండపం, ఎన్జీవో హోంలో శనివారం జరగనున్న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు అత్యవసర సమయాల్లో రక్తదానం చేసేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సిబ్బంది, పలు స్వచ్ఛంద సేవా సంస్థలు మరియు పలువురు రక్తదాతలు పాల్గొన్నారు.

**కొనకళ్ళ సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో.. :** జూన్ 14 తేదీ అంతర్జాతీయ రక్త దాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుడివాడ ఏరియా హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హోమ్ లో బ్లడ్ క్యాంపు నిర్వహించారు. నాకు ఫోన్ చేసి బ్లడ్ బ్యాంకు వారు తెలుపగా మా ట్రస్ట్ సభ్యులు వూర మురళి, కంకణాల నాగరాజు మరి కొంతమంది వెళ్లి రక్తదానము చేశారు. ఈ సందర్భంగా కొనకళ్ళ సీతయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కొనకళ్ళ సీతయ్య మాట్లాడుతూ జూన్ 14 అంతర్జాతీయ రక్త దానదినోత్సవం రక్తదాతలందరికీ అభినందనలు తెలుపుతూ.. ప్రతి ఒక్కరూ రక్త దానము చేయండి ప్రాణాలు కాపాడండి అని పిలుపునిచ్చారు.

**గుడివాడ వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో.. :** శుక్రవారం గుడివాడ వాకర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కొనకళ్ళ సీతయ్య ఛారిటబుల్ ట్రస్ట్ మరియు గుడివాడ ఏరియా హాస్పిటల్ల సహకారంతో జూన్ 14 తేది ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్జీవో హోమ్ లో ఏర్పాటు చేయబడిన బ్లడ్ డొనేషన్ క్యాంప్ నందు ది గుడివాడ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మరియు ఇతరులు మొత్తం 32 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమమునకు ఏరియా హాస్పిటల్ డాక్టర్లు మరియు కొనకళ్ళ సీతయ్య, వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వి.సత్యనారాయణ, చలువాది వెంకట మోహన్ రావు, ఎం. వీరశేఖర్, పామర్తి కేశవరావు, మాచర్ల రామకృష్ణ (ఆర్కే) మరియు వాకర్స్ మిత్రులు పాల్గొన్నారు.

# రంగన్నగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా "సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల" పంపిణీ




**హనుమాన్ జంక్షన్,జూన్ 13 (వార్తాప్రభ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దశ దిశ నిర్దేశంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ఆధ్వర్యంలో గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సూచనలతో కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, రంగన్నగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఈరోజు ఉదయం రాష్ట్ర ప్రభుత్వం "సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకం" కింద మంజూరు చేసిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారంలను స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎం.పి.టి.సి. సభ్యులు పుసులూరి లక్ష్మీనారాయణతో కలిసి విద్యార్థినీ, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో నూతన సంస్కరణలు తీసుకువచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణతా శాతాన్ని పెంచారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు పంపిణీ చేసి ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సౌకర్యాలు కల్పించారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం పరిపాలన సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలనలో భాగంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు "తల్లికి వందనం" పథకం క్రింద రాష్ట్రంలో 67 లక్షల మందికి రు.8,000 కోట్లు ఇవ్వటం గొప్ప విషయమని కృష్ణాజిల్లాలో ఈ పథకం కింద 1.70 లక్షల మందికి, బాపులపాడు మండలంలో 4,000 మందికి, రంగన్నగూడెంలో 96 మందికి మంజూరు చేయటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. ఎం.సి. ఛైర్మన్ నత్తా అబ్రహాం, స్కూల్ ఎస్.ఎం.సి.ఎక్స్ అఫీషియో సభ్యులు తుమ్మల దశరథరామయ్య, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఆర్. గ్లోరీ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతతో చదివిన ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుతారు



**కృత్తివెన్ను,జూన్ 13 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెందురు లో 2009 బి 10 లో ఎస్ ఎస్ సి చదివిన పూర్వ విద్యార్థి డాక్టర్ ఎర్రంశెట్టి సాయి శ్రీనివాస్ గుజరాత్ లోని జివిప్పిఎల్ లో సైంటిస్ట్ సెలెక్ట్ కాబడిన సందర్భంగా ఆ పాఠశాల బోధన సిబ్బంది డాక్టర్ ఎర్రంశెట్టి సాయి శ్రీనివాస్ ను శుక్రవారం నాడు పాఠశాలలో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాగంటి నాగబాబు మాట్లాడుతూ ఒక ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈరోజు ఇంత ఉన్నతి స్థాయిలో శాస్త్రవేత్తగా ఎదగడం అనేది పెందుర్రు పాఠశాల ఉపాధ్యాయుల బోధనాపటిమను కృషిని తెలియజేస్తోంది అన్నారు. డాక్టర్ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్యం నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ ఆర్థికంగా వెనుకబడినప్పటికీ కృషి పట్టుదలతో తాత ఎర్రంశెట్టి గోపాలరావు ప్రోత్సాహంతో ఈరోజు ఈ స్థాయికి రావడం జరిగింది.దీనికి కారణమైనటువంటి కుటుంబ సభ్యులకి , చదువు నేర్పిన ఉపాధ్యాయులకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం 2024 25 లో 10వ తరగతిలో పెందూరు ఉన్నత పాఠశాల నుంచి 500 కు పైగా మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు పాఠశాల సిబ్బంది గ్రామ పెద్దలు సత్కారం చేయడం జరిగింది. కేసిరెడ్డి నాగేశ్వరావు ఆ విద్యార్థులకు 11 వేల రూపాయలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మాదాసు శకుంతల ఎస్ఎంసి చైర్మన్ ప్రతి రామారావు గారు మాజీ సర్పంచులు బండారు సత్యనారాయణ ప్రతీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు ఇదంతా ఉపాధ్యాయుల కృషిని విద్యార్థుల యొక్క ప్రతిభని ఎంతగానో కొనియాడారు భవిష్యత్తులో దీనిని పూర్తిగా తీసుకొని విద్యార్థులు అందరూ కూడా మంచి స్థాయికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు రెండు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో పెందూరు పాఠశాలకు ప్రథమ స్థానం రావడం వెనుక గల ఉపాధ్యాయుల కృషిని గ్రామస్తులంతా ముక్తకంఠంతో కొనియాడారు.

# ఇరువురికి వైద్యచికిత్స నిమిత్తం సి.ఎమ్. ఆర్.ఎఫ్ ఎల్.వో.సి లు అందచేసిన యార్లగడ్డ



**గన్నవరం,జూన్ 13 (వార్తాప్రభ) :** ఇరువురు రోగులకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసి లను ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావు రోగులకు అందజేశారు. గన్నవరం మండలం బుద్ధవరం గ్రామస్తులు భువనేశ్వరి పలగాని రూ. 3. 50 లక్షలు, కొండపావులూరు గ్రామానికి చెందిన కూచిపూడి కోటేశ్వరమ్మ కు రూ.2 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఎల్ వో సి లను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యార్లగడ్డ అందజేశారు. వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సాయం లభించేలా కృషిచేసిన యార్లగడ్డకు రోగుల కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. పెద్ద రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా గన్నవరం నియోజకవర్గంలో ఎక్కువమందికి సహాయం అందించినట్లు ఈ సందర్భంగా యార్లగడ్డ తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధిని పేద రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేనికి సుప్రీంకోర్టులో ఊరట

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించింది.తన అరెస్ట్ ను సవాల్ చేస్తూ కొమ్మినేని శ్రీనివాసరావు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్పై విచారణ జరిపిన ధర్మాసనం, ఆయనకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. కొమ్మినేనిని విడుదల చేయాలని ఆదేశిస్తూ, బెయిల్ మంజూరు చేసింది. కొమ్మినేని విడుదలకు సంబంధించిన అన్ని నిబంధనలు, ప్రక్రియలను సంబంధిత ట్రయల్ కోర్టు చూసుకుంటుందని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా కొమ్మినేని తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదనలు వినిపిస్తూ... సాక్షి ఛానల్ లో చర్చ సందర్భంగా కొమ్మినేని మహిళల పట్ల ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదని... చర్చలో పాల్గొన్న ఒక ప్యానలిస్ట్ ఆ వ్యాఖ్యలు చేశారని కోర్టుకు తెలిపారు.

# చిన్న హాస్పిటల్స్ ను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదు

● ఇలా చేస్తే రాష్ట్ర,దేశాలలో చిన్న హాస్పిటల్స్ కనుమరుగైపోతాయి ●హాస్పిటల్స్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది


● ప్రజల ప్రాణాలను కాపాడేందుకే వైద్యులు ఉన్నది : అప్నా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఏ.వి సుబ్బారెడ్డి



**తిరుపతి,జూన్ 13 (వార్తాప్రభ) :** ప్రజలకు అత్యంత చేరువలో ఉండే చిన్న హాస్పిటల్స్ ను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని,అత్యవసర సమయంలో మొదట చిన్న హాస్పిటల్సే ఉపయోగపడతాయన్న విషయాన్ని ప్రజలు ఆలోచించి చిన్న హాస్పిటల్స్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(అప్నా) రాష్ట్ర అధ్యక్షులు,ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్స్ ఆఫ్ ఇండియా ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ డాక్టర్ ఏ.వి సుబ్బారెడ్డి కోరారు.జూన్ 9వ తేదీ సోమవారం తిరుపతిలోని ఓ 20 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని ఆపాలని వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం అప్నా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సుబ్బారెడ్డి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ డాక్టర్ జనార్దన్,తిరుపతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవిరాజు, కార్యదర్శి డాక్టర్ మారుతి కృష్ణ, కోశాధికారి డాక్టర్ దామోదర్ తో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ హాస్పిటల్స్, వైద్యులు ఉన్నది ప్రజల ప్రాణాలను కాపాడేందుకే తప్ప,వారిని ఇబ్బంది పెట్టేందుకు కాదని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి వైద్యులకు అండగా ఉండాలన్నారు.నియమ నిబంధనల ప్రకారం నిర్మిస్తున్న 20 పడకల ఆసుపత్రిని అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.కొంతమంది స్వలాభాల కోసం హాస్పిటల్స్ ను అడ్డుకోవడం వలన రానున్న రోజులలో రాష్ట్రంలోనే కాదు దేశాలలో కూడ చిన్న ఆసుపత్రులు అనేవి లేకుండా కనుమరుగై పోతాయని గుర్తు చేశారు.మన పరిసర ప్రాంతాలలో చిన్న ఆసుపత్రిలు ఉండడం వలన అత్యవసర సమయంలో అవసరమైన వైద్యం అందించడమే కాక పెద్ద ఆసుపత్రికి వెళ్లే లోపు రోగికి కావలసిన కనీస వైద్యాన్ని పొందగలమన్న విషయాన్ని గ్రహించాలన్నారు.ఈ రోజుల్లో రూరల్,ఏరియాలలో,తాలూకా హెడ్ క్వార్టర్లలో కానీ,చిన్న చిన్న పట్టణాలలో కానీ వైద్యం అందరికీ అందుబాటులో ఉండేది ఒక గవర్నమెంట్ హాస్పిటల్ మరియు ఈ చిన్న హాస్పిటల్స్ అన్నారు. డాక్టర్లకి ఏమీ వాళ్లు ఎంతో బాగా సంపాదిస్తానన్నారు అన్నది ఒకప్పటి మాట,ప్రస్తుతం దాదాపు 50 శాతం హాస్పిటల్స్ నష్టాల్లోనే నడుస్తున్నాయని,తాము చేసిన వృత్తికి న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే ఎంతోమంది వైద్యులు వైద్యం అందిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉందని,అలా కాదని హాస్పిటల్ స్థాపనను వ్యతిరేకిస్తే నష్టపోయేది మనమే అన్న విషయాన్ని గ్రహించాలన్నారు. అలా చేస్తే అప్నా చూస్తూ ఊరుకోదని, వైద్యులకు అప్నా ఎప్పుడు అండగా ఉంటుందని భరోసా ఇస్తున్నామన్నారు. అదేవిధంగా దేనిని కమర్షియల్ చేయాలి,దేనిని నాన్ కమర్షియల్ చేయాలి అన్న విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టి 20 బెడ్లు,20 కంటే తక్కువగా ఉన్న బెడ్లకు రూల్స్ సరళతరం చేయవలసిన అవసరం ఉందని తెలిపారు.వచ్చిన ఫిర్యాదు పై వెంటనే స్పందించి దాని నియమ నిబంధనలు తెలుసుకొని సమస్య పరిష్కరించిన కమిషనర్ కు ఈ సందర్భంగా అప్నా తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన తెలియజేశారు. అనంతరం అప్నా జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ రవిరాజు,డాక్టర్ మారుతి కృష్ణ మాట్లాడుతూ మన కాలనీలో హాస్పిటల్ వస్తే మనకే మంచిది అన్న విషయం ప్రజలు గ్రహించాలన్నారు.స్కూల్స్, అపార్ట్మెంట్స్,షాపింగ్ కాంప్లెక్సు లాంటి వాటికి లేని అభ్యంతరాలు మన ప్రాణాలను కాపాడే హాస్పిటల్స్ కు వచ్చిందా అని ఆవేదన వ్యక్తం చేశారు.మన ప్రాంతంలో హాస్పిటల్స్ కావాలి అని అడగాలి తప్ప వద్దు అనడం సరైన పద్ధతి కాదని,హాస్పిటల్స్,వైద్యుల సమస్యలపై తాము ప్రభుత్వంతో కూడా ఫైట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

**నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్నాయి : కమిషనర్ ..** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదు మేరకు హాస్పిటల్ స్థాపనకు కావలసిన నియమ నిబంధనలన్నీ ఎంక్వయిరీ చేయడం జరిగిందన్నారు.ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం అన్ని అనుమతులు ఉండడంతో హాస్పిటల్ నిర్మాణం కొనసాగించేందుకు పర్మిషన్ ఇవ్వడం జరిగిందని కమిషనర్ మౌర్య తెలిపారు.


# పొందుగల ఎర్ర చెరువులో ఆగని మట్టి మాఫియా



- పొందుగల ఎర్ర చెరువులో ఆగని "మట్టి మాఫియా"
- అక్రమార్కులకు కాసులు కురిపిస్తున్న ఎర్ర చెరువు మట్టి
- ఎర్ర చెరువులో హద్దులు దాటుతున్న మట్టి అక్రమ రవాణా
- పెద్ద పెద్ద గోతులతో ప్రమాదాన్ని తలపిస్తున్న ఎర్ర చెరువు
- జెసిబి, ట్రాక్టర్ల కు ఫైన్లు వేయకుండానే వదిలేస్తున్న అధికారులు
- పట్టించుకోని రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు
- అక్రమార్కుల నుంచి పొందుగల ఎర్ర చెరువు ను కాపాడాలంటున్న గ్రామస్తులు

**అక్రమార్కులకు చెరువు మట్టి కాసులు కురిపిస్తుంది. ఎటువంటి అనుమతులు లేకున్నా తమకు అధికారుల నుంచి ప్రత్యేక అనుమతులు ఉన్నాయంటూ అధికార పార్టీ నాయకులు మండలంలోని పొందుగుల గ్రామ శివారు ఎర్ర చెరువు నుంచి హద్దులు దాటి మరీ మట్టిని అక్రమంగా తరలించేస్తున్నారు. జెసిబి లు ఏర్పాటు చేసి వందల సంఖ్యలో ట్రాక్టర్లతో మట్టిని తోడేస్తున్నారు. ఏంటి ఈ అరాచకం అంటూ స్థానిక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఒక్కొక్క ట్రాక్టర్ కు గరిష్టంగా 1200 రూపాయల వరకు అక్రమార్కు లు వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవిన్యూ, ఇరిగేషన్, పోలీసు యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. ఇరిగేషన్ శాఖ అధికారులు ధైర్యం చేసి మట్టి మాఫియాను అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడో లేక వారి పైఅధికారుల ఇచ్చే ఆదేశాలతో అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న అక్రమార్కుల జెసిబి, ట్రాక్టర్లను పట్టుకొని కూడా సీజ్ చేయకుండా వదిలేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండిపడుతుంది.**






**మైలవరం,జూన్ 13 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా,మైలవరం మండలం లోని పొందుగల ఎర్ర చెరువులో మట్టి మాఫియా ఆగటంలేదు. అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవడంలో రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు వెనకడుగు వేస్తున్నారు. ఇరిగేషన్ ఏఇ ధైర్యం చేసి మట్టి మాఫియాను అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికి స్థానిక అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడో లేక వారి పైఅధికారుల ఇచ్చే లాలూచి ఆదేశాలతో అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న అక్రమార్కుల జెసిబి, ట్రాక్టర్లను పట్టుకొని కూడా సీజ్ చేయకుండా వదిలేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండిపడుతుంది. పొందుగల ఎర్ర చెరువు,ఎలాంటి అనుమతులు లేకుండా ఈ ఇరిగేషన్ చెరువు నుంచి వందల క్యూబిక్ మీటర్ల మట్టిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకులుగా చలామణి అవుతున్న కొందరు నాయకులు మట్టి దందా కు పాల్పడుతున్నారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణం కలిగిన పొందుగల ఎర్ర చెరువు నుంచి పగలు, రాత్రి అని తేడా లేకుండా మట్టిని మైలవరం పట్టణ పరిసర ప్రాంతాలలోని ఖాళీగా ఉన్న ప్రైవేటు స్థలాలకు,వెంచర్లకు తరలించి అక్రమార్కులు పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఎర్ర చెరువులో అనుమతులు లేకుండా మట్టి తోలకాలు జరుగుతున్నాయని తెలిసినా ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇలా ఎవరికివారు ఇష్టాను సారంగా చెరువులను కొల్లగొడుతుండటంతో చెరువులు ప్రమాదకరంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అక్రమార్కులు ట్రక్ మట్టిని అవసరాన్ని బట్టి రూ. 800 నుంచి రూ. 1200 ల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.

**పెద్ద పెద్ద గోతులతో ప్రమాదాన్ని తలపిస్తున్న ఎర్ర చెరువు:** జేసిబిలతో మట్టిని ఇష్టాను సారంగా తోడేస్తుండటంతో ఎర్ర చెరువులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదాన్ని తలపిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధి కారులు స్పందించి మట్టి మాఫియాను అరికట్టి పొందుగల ఎర్ర చెరువును కాపాడాలని ప్రజలు కోరుతున్నారు

# జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నద్ధతలో భాగంగా ఆల్ ఇండియా రేడియోలో "యోగా" కార్యక్రమం







**విజయవాడ(పి.ఐ.బి.),జూన్ 13 (వార్తాప్రభ) :** జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నద్ధతలో భాగంగా, విజయవాడలోని ఆల్ ఇండియా రేడియో ప్రాంగణంలో ఒక ఉత్సాహభరితమైన యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ కార్యక్రమంలో సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ఆకాశవాణి, దూరదర్శన్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి.), మరియు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సి.బి. సి.)తో సహా వివిధ మీడియా విభాగాలకు చెందిన 150 మందికి పైగా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం చేస్తూ, సమతుల్య మరియు ఆరోగ్యకరమైన జీవితాన్ని సాధించే పరివర్తన శక్తి యోగా కి ఉందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. పీఐబీ విజయవాడ అదనపు డైరెక్టర్ జనరల్ రాజిందర్ చౌదరి మరియు ఆల్ ఇండియా రేడియో విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎం. సోమేశ్వర రావు కార్యక్రమంలో గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఉత్సాహంగా యోగ సాధనలో పాల్గొన్న సిబ్బందిని వారు ప్రశంసించారు. యోగా ద్వారా ఆరోగ్యాన్ని స్వీకరించడంలో మీడియా సిబ్బంది చురుకైన భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. ఉదయం 6:00 గంటలకు శిక్షణ పొందిన బోధకుల నేతృత్వంలో వివిధ యోగా ఆసనాల ప్రదర్శనతో సెషన్ ప్రారంభమైంది. ప్రభుత్వ సిబ్బందిలో సమగ్ర శ్రేయస్సు పట్ల పెరుగుతున్న అవగాహన మరియు నిబద్ధతను ప్రతిబింబిస్తూ, పాల్గొన్నవారు గొప్ప ఉత్సాహం మరియు శక్తిని ప్రదర్శించారు. ఈ సంవత్సరం ప్రత్యేక ప్రాముఖ్యతతో జరుపుకునే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందు దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమాల శ్రేణిలో ఈ కార్యక్రమం భాగమని పేర్కొన్నారు. జూన్ 21న విశాఖపట్నంలో జరిగే ప్రధాన కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతున్నారు. విశాఖ యోగ కార్యక్రమానికి ఐదు లక్షలకు పైగా పాల్గొంటారని భావిస్తున్నారు. యోగాను ప్రజా ఉద్యమంగా మార్చడానికి మరియు శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యానికి దాని ప్రయోజనాలను ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం యొక్క నిరంతర నిబద్ధతను వాడవాడలా జరుగుతున్న సన్నాహక కార్యక్రమాలు ప్రతిబింబిస్తాయి.

# బౌద్ధ క్షేత్రంలో యోగాంధ్ర సాధన..

- సాధన చేసిన ఎంఎల్ఏ మండలి బుద్ధప్రసాద్, అధికారులు.





**ఘంటసాల/అవనిగడ్డ,జూన్ 13 (వార్తాప్రభ) :** ప్రాచీన బౌద్ధ క్షేత్రం ఘంటసాలలోని బౌద్ధ మహా చైత్యంగా భాసిల్లుతున్న పురాతన బౌద్ధ స్థూపం వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం అద్భుతమైన భారతీయ యోగా వైభవానికి ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. ప్రాచీన భారతీయ కళలకు, తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే అవనిగడ్డ నియోజకవర్గ శాసన సభ్యులు, రాష్ట్ర అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ సభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిధిగా విచ్చేసి యోగాంధ్ర వేడుకలు ప్రారంభించారు. మహా బౌద్ధ స్థూపం చుట్టూ, ప్రాంగణం మొత్తం ఆశీనులైన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, యోగా అభ్యాసకులతో యోగా గురువులు యోగా ఆసనాలు, ప్రాణాయామం చేయించారు. వందలాది మంది యోగా ఆసనాలతో బౌద్ధ క్షేత్రం భారతదేశానికే స్వంతమైన ప్రాచీన యోగా ప్రాశస్త్యం చాటి చెప్పే వేదికలా నిలిచింది.

**నాగాయలంక వద్ద కృష్ణానదిలో జల యోగా..** యోగాంధ్ర-2025 సందర్భంగా నాగాయలంక కృష్ణానదిలో జల యోగా చేశారు. శుక్రవారం నాగాయలంకలోని శ్రీరామపాద క్షేత్ర తీరాన యోగా గురువులు యోగా సాధనా సామర్ధ్యంతో నదీజలాల్లో తేలియాడుతూ యోగా ఆసనాలు వేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ తిలకించి అభినందించారు. తహసీల్దార్ హరనాధ్, ప్రముఖులు మండవ బాలవర్ధిరావు, తలశిల రఘుశేఖర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ-నాఫ్ ఇండియా పరిశ్రమకు 'గ్రీన్' గుర్తింపు

- గ్రీన్‌కో సమ్మిట్ 2025 కార్యక్రమంలో అవార్డు బహుకరణ




**తిరుపతి,జూన్ 13 (వార్తాప్రభ) :** శ్రీసిటీలోని నాఫ్ ఇండియా పరిశ్రమకు ప్రతిష్టాత్మక 'గ్రీన్' (పర్యావరణ హిత సంస్థ) గుర్తింపు దక్కింది. ఈ నెల 12న హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ నిర్వహించిన 'గ్రీన్‌కో సమ్మిట్ 2025' కార్యక్రమంలో ఈ అవార్డును నాఫ్ ఇండియాకు అందచేశారు. 12, 13 వ తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ అంతర్జాతీయ సదస్సులో నికర-సున్నా పరివర్తన, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి, ఏఐ తదితర రంగాలకు సంబంధించిన అంతర్జాతీయ నిపుణులు, పరిశ్రమ ప్రముఖులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్త మార్గదర్శకాలకు అనుగుణంగా అభివృద్ధి చేసిన గ్రీన్‌కో రేటింగ్ వ్యవస్థ ద్వారా వివిధ సంస్థల పర్యావరణ పనితీరును అంచనా వేస్తుంది. మరియు సహజ వనరుల సమర్థవంతమైన వినియోగం, కాలుష్య తగ్గింపు, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహిస్తుంది. ఈ మేరకు గుర్తింపు పొందిన నాఫ్ ఇండియా, గ్రీన్ తయారీ, పర్యావరణ నిర్వహణలో తన నిబద్ధతను చాటుకుంది. తక్కువ-కార్బన్ ఉత్పత్తి పద్ధతులను వినియోగించి నాణ్యమైన నిర్మాణ సామగ్రి వినియోగంతో పాటు శక్తి మరియు నీటిని సమర్థవంతంగా కంపెనీ ఉపయోగించింది. దేశంలో పర్యావరణ స్పృహతో కూడిన మౌళిక సదుపాయాల కల్పనకు ఇది అద్దం పడుతోంది. నాఫ్ బృందాన్ని అభినందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఈ గుర్తింపు శ్రీసిటీకి గర్వకారణం అంటూ తన సందేశంలో పేర్కొన్నారు. తాము ప్రోత్సహించే సుస్థిర పారిశ్రామిక అభివృద్ధి స్ఫూర్తిని ఇది ప్రతిబింబిస్తుందని వ్యాఖ్యానించారు. గ్రీన్ తయారీకి కొత్త ప్రమాణాలను పాటించడంలో ఇతర సంస్థలకు నాఫ్ ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

# నిరుపేద విద్యార్థిని చదువుకు కంకిపాడు ఎస్ఐ సందీప్ ఆర్థిక సహాయం.



**చల్లపల్లి/అవనిగడ్డ,జూన్ 13 (వార్తాప్రభ) :** ఖాకీలు అంటే లాఠీలు చేతబట్టి తమ కఠిన్యాన్ని చూపుతారనేది నేటి సమాజంలో ఉన్న అపోహ. అదంతా తమ విధి నిర్వహణలో భాగమేనని, వ్యక్తిగతంగా తమకు కూడా తోటి వారిని ఆదుకునే హృదయం ఉంటుంది అని కొందరు పోలీసులు తమ సేవభావాన్ని చూపుతుంటారు. అటువంటి వారిలో కంకిపాడు ఎస్ ఐ గా చేస్తున్న సందీప్ ఒకరు. చల్లపల్లి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థినికి వరుసగా రెండవ ఏట తన చదువుకు అయ్యే పుస్తకాల ఖర్చును అందించారు. రాయవరపు గాయత్రి అనే విద్యార్థిని చిన్నతనంలోనే తన తండ్రిని కోల్పోగా, తన తల్లి రోజువారీ కూలీగా పనిచేస్తూ తన బిడ్డను పోషిస్తుంది. తన బిడ్డ గాయత్రి ని చదివించే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయం కొందరి మిత్రుల ద్వారా తెలుసుకున్న ఎస్ ఐ సందీప్ గాయత్రి చదువు అయ్యే పుస్తకాల ఖర్చును తనవంతుగా ఆర్థిక సహాయం అందిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. అనేక సందర్భాలలో పలువురికి గుప్త దానాలు చేస్తూ ఆయన తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

# ఎన్ టి ఆర్ జిల్లా రెడ్ క్రాస్ ఆదర్శనంగా నిలవాలి

- కలెక్టర్ లక్ష్మీ షా సూచన
- సమర్థవంతమైన కార్యవర్గం



**విజయవాడ,జూన్ 13 (వార్తాప్రభ) :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని ఎన్టీఆర్ జిల్లాలో ఆదర్శంగా తీర్చిదిద్దడానికి అన్ని రకాల సేవలు అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా కోరారు. నూతనంగా ఎంపికైన ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గంతో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉదయం కలెక్టర్ కార్యాల యంలో సమావేశం అయ్యారు .ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ జి సమరం ,వైస్ చైర్మన్ డాక్టర్ వెలగా జోషి ఆధ్వర్యంలో కార్యవర్గం జిల్లా కలెక్టర్ తో సమావేశమైంది .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మిషా మాట్లాడుతూ కొత్త కార్యవర్గ ఎంపిక పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యవర్గంలో సమర్థులకు స్థానం దక్కిందని, ఈ కార్యవర్గం రాబోయే రోజుల్లో విస్తృతమైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. డాక్టర్ సమరం, డాక్టర్ వెలగా జోషి ల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మెరుగైన, సమర్థవం తమైన సేవలను అందిస్తుంది అనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు .రెడ్ క్రాస్ లోను, ఇండియన్ మెడికల్ అసోసియేషన్లోనూ డాక్టర్ జి సమరం చేసిన సేవలు, ఉన్న అనుభవాన్ని ఇప్పుడు పూర్తిస్థాయిలో వినియోగించాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా విద్యారంగంలోనూ,ఎం ఎస్ ఎస్ లోనూ డాక్టర్ వెలగా జోషి చేసిన సేవలు ఇప్పుడు రెడ్ క్రాస్ సొసైటీ కి పూర్తిస్థాయిలో వినియోగించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యా రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ని వినియోగించుకోవాలి






**గుంటూరు,జూన్ 13 (వార్తాప్రభ) :** స్థానిక టి జె పి యస్ కళాశాల లో ఈరోజు కళాశాల అధ్యాపకులకు "ఎఐ టూల్స్ ఫర్ టీచింగ్ అండ్ రీసెర్చ్ " అనే అంశం పై కార్యశాల నిర్వహించి నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. ఈ కార్యశాల(వర్క్ షాప్ )కు యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ మరియు ఇంజనీరింగ్ నుండి డాక్టర్ యమ్ కృష్ణ శివ ప్రసాద్ విచ్చేశారు. వీరు మాట్లా డుతూ మారుతున్న విద్యారంగంలో వస్తున్నటువంటి మార్పులను మనం తప్పకుండా స్వాగతించాలని, మార్పు లకు అనుగుణంగా ఆర్టిఫిషల్ ఇంటిలి జెన్స్ సహాయం తో వేగ వంతమైన జ్ఞానాన్ని తక్కువ సమయం లో పొందవచ్చునని చెప్పారు. ఉదయం జరిగిన సెషనలో విద్యా బోధనలో మరియు పరిశోధనా రంగం లో ఎఐ ను ఎలా ఉపయోగించలో చెప్పారు. మధ్యాహ్నం సెషనలో కంప్యూటర్ లాబ్ లో ఏవిధంగా వినియోగించాలో ప్రాక్టికల్ గా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం అధ్యాపకులకు సెక్రటరీ మరియు కరెస్పాండంట్ కె వి బ్రహ్మం చేతులమీదుగా అధ్యాపకులకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమం లో పి జి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ అనితా దేవి,డాక్టర్ యు రవి కుమార్,డాక్టర్ నాగ నిర్మల, డాక్టర్ యస్ శ్రీనివాసరావు మరియు డిగ్రీ మరియు పి.జి. అధ్యాపకులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం సంవత్సరం పూర్తయిన సందర్భంగా రేగుంట గ్రామం నందు వేడుకలు



**నూజివీడు,జూన్ 13 (వార్తాప్రభ) :** నూజివీడు మండలం రేగుంట గ్రామం నందు కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కాలం పూర్తి అయిన సందర్భంగా రేగుంట టిడిపి యువ నాయకులు బురుగు జోషి ఆధ్వర్యంలో గొప్ప అన్నదాన కార్యక్రమంతో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ ఎనమందల గ్రామపంచాయతీ లో భాగమైన రేగుంట గ్రామం గ్రామంలో రైతులకు ఎకరము, అర్ర ఎకరం భూమి ఉంది అంటే అది గతంలో టిడిపి ఇచ్చిందేనని అందులో రకరకాల పంటలు పండించి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారని. అదేవిధంగా ఎనమందల పంచాయతీలో వెటర్నరీ హాస్పిటల్, సచివాలయం, డ్వాక్రా మహిళ బ్యాంక్ అవసరాల నిమిత్తం ప్రజలు రేగుంట నుండి ఎనమందల వెళ్లాలి అంటే సరైన రోడ్డు మార్గం లేక గత శతాబ్దాల నుండి ఇబ్బంది ఎదుర్కొంటున్నారని నూజివీడు ఎమ్మెల్యే మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన మంత్రి రెండు కెనాల్ వంతెనల నిర్మాణం కొరకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారని అదేవిధంగా రేగుంట గ్రామం నుండి నెహ్రూ పేట మీదగా నూజివీడు వెళ్ళుటకు రోడ్డు మార్గం సరిగా లేనందున ఇబ్బందులు పడుతున్నామని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన పార్థసారథి త్వరలోనే ఆ రోడ్డు కూడా తారు రోడ్డు నిర్మించే విధంగా పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు టిడిపి పార్టీలోనే ఉంటానని ఎలాంటి సమస్యలు వచ్చిన తట్టుకొని పార్టీలోనే కొనసాగుతానని జోషి అన్నారు. ఇంకా మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గ అభివృద్ధి పార్థసారథి కి ముందు పార్థసారథి తర్వాత అని చెప్పుకునే విధంగా మంత్రి పార్థసారథి ఆధ్వర్యంలో అభివృద్ధి కొనసాగుతుందని అభివృద్ధి చేయడం ఇంకెవరు వల్ల సాధ్యం కాదని విజన్ ఉన్న నాయకుడు మా సీఎం చంద్రబాబు నాయుడు అని అలాంటి నాయకత్వంలో పనిచేయటం మా అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మండల పార్టీ అధ్యక్షులు రాజాబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు సంగీతరావు, అక్కినేని చందు, కౌన్సిలర్ విజయ, నత్త నాగేశ్వరరావు, గౌరీ శంకరి, కూటమి నాయకులు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188